PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 137 | విజయవాడ, ఆదివారం 18 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 18 December 2022 | Rs

పురుగు మందుల తగ్గింపు లక్ష్యం అనవసరం !

- కెనడాలోని జీవ వైవిధ్య సదస్సులో భారత్ సూచన

లోపలి పేజీలో..

మూడోసారి మురిసేదెవరో..?

- ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ నేడు..
- క్రొయేషియాకు మూడోస్థానం

క్రీడా పేజీలో

చింతపల్లి రోడ్డులో బైఠాయించిన గిరిజన సంఘం, అఖిలపక్ష పార్టీల నాయకులు, గిరిజనులు

హైడ్రోపై

చింతపల్లి ఏజెన్సీ బంద్

- మూతబడిన దుకాణాలు
- నిలిచిన రాకపోకలు
- గిరిజనుల ర్యాలీ, రోడ్డుపై బైఠాయింపు

ప్రజాశక్తి- అల్లూరి జిల్లా యంత్రాంగం

షెడ్యూల్డ్ ఏరియాలో నిబంధనలను ఉల్లంఘించి చింతపల్లి మండలం ఎర్రవరం వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రయివేటు సంస్థకు ప్రభుత్వాలు అప్పగించడాన్ని నిరసిస్తూ ఎపి గిరిజన సంఘం, అఖిలపక్ష పార్టీలు, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యాన చింతపల్లి మన్యంలో శనివారం బంద్ విజయవంతమైంది. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత మండలాలైన చింతపల్లి, కొయ్యూరు, జికె.వీధి మండలాల్లో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఆటో డ్రైవర్లు ఆటోలను ఎక్కడికక్కడ నిలిపివేసి బంద్‌కు సహకరించారు. మండల కేంద్రాల్లో భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పెద్ద పెట్టున నినదించారు. ఆంధ్ర కాశ్మీర్‌గా పేరు పొందిన చింతపల్లి మండలం లంబసింగి పర్యాటక ప్రాంతం ముఖద్వారానికి తెల్లవారుజామున నాలుగు గంటలకే పెద్ద ఎత్తున గిరిజనులు చేరుకొని రాకపోకలను అడ్డుకున్నారు. అనంతరం అక్కడి నుంచి మండల కేంద్రానికి వచ్చి స్థానిక హనుమాన్ జంక్షన్లో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, గిరిజన సంఘాలతో కలిసి మెయిన్ రోడ్డులో బైఠాయించారు. పాత బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అప్పలనర్స మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో గిరిజన వ్యతిరేక ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ఏజెన్సీలోని ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు విషయంలో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి ఎలా అనుమతులిస్తారని మోడీ సర్కారును ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వ డైరక్షన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో షిరిడీ సాయి సంస్థకు ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును అప్పగించిందన్నారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ గిరిజనుల పోరాటానికి తమ పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు, కాంగ్రెస్ పార్టీ పాడేరు ఇన్‌ఛార్జి వంతల సుబ్బారావు పాల్గొన్నారు. కొయ్యూరులో జరిగిన బంద్‌లో ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఎర్రవరం వద్ద ప్రాజెక్టు వల్ల సుమారు 32 గ్రామాలకు చెందిన ఆరు వేల మంది గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి వైసిపి ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బియ్యం గోధుమ ధరలు పైపైకే!

- ప్రజలకు దక్కని ఊరట
- ఫలితమివ్వని కేంద్రం చర్యలు

న్యూ ఢిల్లీ : ద్రవ్యోల్బణం దిగివస్తోందంటూ కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు ఎలా ఉన్నప్పటికీ ఆహారధాన్యాల ధరలు మాత్రం పైపైకే దూసుకుపోతున్నాయి. దీంతో సాధారణ ప్రజానీకం తమ కష్టార్జితంలో అధికభాగాన్ని తిండి గింజల కోసమే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దేశ వ్యాప్తంగా బియ్యం, గోధుమల ధరలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. వీటి ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా చేతులెత్తేసింది. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం పరిధిలోకి వచ్చే మిగిలిన వాటి ధరలు తగ్గినప్పటికీ ప్రజానీకానికి ఫలితం కనిపించడంలేదు. ప్రభుత్వం మాత్రం ధరలు తగ్గుతున్నాయంటూ, ఆహార ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చేసిందంటూ ఆర్భాటపు ప్రకటనలు చేస్తోంది.

ఎంత పెరిగాయి...?

తిండిగింజల (బియ్యం, గోధుమలు) ద్రవ్యోల్బణం అక్టోబర్ నెలలో 12.08 శాతం ఉండగా, నవంబర్ నెలాఖరుకు 12.96 శాతానికి చేరింది. డిసెంబర్‌లోనూ వీటి ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది జనవరి నెలలో 2.8శాతంగా ఉన్న బియ్యం ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 3.96 శాతానికి, అక్టోబర్‌లో 10.21శాతానికి, నవంబర్‌లో 10.51 శాతానికి చేరింది. డిసెంబర్‌లో దాదాపుగా 11 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా. గోధుమల ద్రవ్యోల్బణం కూడా ఈ ఏడాది ప్రారంభంలో 5.1 శాతం ఉండగా, ఏప్రిల్ నాటికి 9.59 శాతానికి, అక్టోబర్ నెలలో 17.64 శాతానికి, నవంబర్‌లో 19.67 శాతానికి చేరింది. డిసెంబర్ నెలాఖరుకు 20శాతానికి గోధుమల ద్రవ్యోల్బణం చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. బియ్యం, గోధుమల ధరలు పెరగడం ఇదే మాదిరి కొనసాగితే ప్రజానీకానికి మరిన్ని ఇక్కట్లు తప్పవు.

ఇతర ఆహార ధాన్యాల పరిస్థితి ఏమిటి?

కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం బియ్యం, గోధుమలు మినహా ఇతర ఆహార ధాన్యాల ధరలు ఈ ఏడాది తగ్గుముఖం పెట్టాయి. ఫలితంగా మొత్తం ద్రవ్యోల్బణంతో పాటు, ఆహారధాన్యాల ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పెట్టింది. దేశ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ నిర్ధేశించిన ఆరుశాతానికన్నా దిగివచ్చిందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇంత ద్రవ్యోల్బణం ఈ స్థాయికి తగ్గడం గత 11 నెలల్లో ఇదే మొదటిసారి. అదే విధంగా ఆహారద్రవ్యోల్బణం కూడా 11 నెలల కనిష్టం 4.67శాతానికి దిగివచ్చిందని కేంద్రం తెలిపింది. బియ్యం, గోధుమలు మినహాయించి ఇతర ఆహారధాన్యాల ధరలు తగ్గడమే ఈ తరుగుదలకు కారణం. అయితే, అక్టోబర్, నవంబర్ నెలలో వాటి ధరలు కూడా పెరిగాయి. సెప్టెంబర్ నెలలో వీటి ద్రవ్యోల్బణం 1.37శాతం ఉండగా, అక్టోబర్‌లో 1.99 శాతానికి చేరింది. నవంబర్‌లో కొంచెం తగ్గినా 1.70శాతంగా ఉంది. దీంతో రాబోయే రోజుల్లో వీటి ధరలు ఎలా ఉంటాయన్న అంశం ఆందోళన కలిగిస్తోంది.



బియ్యం, గోధుమలతో పాటు వీటి ధరలు కూడా పెరిగే సామాన్యుల పరిస్థితి మరింత ఘోరంగా మారుతుంది.

ఎందుకీ స్థితి?

ఈ ఏడాది దేశ వ్యాప్తంగా బియ్యం, గోధుమల ఉత్పత్తి తగ్గింది, అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది జూన్ వరకు సేకరించిన ధాన్యం గత ఏడాదితో పోలిస్తే 3.8 మిలియన్ టన్నులు తక్కువ. దీంతో ప్రైవేటు వ్యాపారులు కూడా నిర్ధేశించుకున్న లక్ష్యాల కన్నా తక్కువగానే ధాన్యం కొనుగోలు చేశారు. బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో దాన్యం ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. మార్కెట్‌లో డిమాండ్ మేరకు బియ్యం అందుబాటులో లేకపోవడంతో ధరలు భారీగా పెరిగాయి. దీని ప్రభావం గోధుమలపై కూడా పడింది. అదే సమయంలో గోధుమల మిగతా 2లో



పాఠశాల విద్యలో సెమిస్టర్ పరీక్షలు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యలో సెమిస్టర్ పరీక్షల విధానాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి ప్రతాప్ రెడ్డి శనివారం విడుదల చేశారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ విధానం 2023-24 (వచ్చే విద్యాసంవత్సరం) నుంచి అమలు కానుందని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు 2024-25 విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెడతామని వెల్లడించారు. నూతన విద్యావిధానం - 2020లో భాగంగా రాష్ట్రప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఎస్‌సిఇఆర్‌టి ఇప్పటికే మూడు సెమిస్టర్ల విధానంలో, 6వ తరగతి విద్యార్థులకు రెండు సెమిస్టర్ల విధానంలో పాఠ్యాంశ పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందజేసింది. 7, 8 తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలు అందజేసింది. పరీక్షలను మాత్రం ఎప్పుడూ నిర్వహించే విధంగా విద్యాసంవత్సరం చివరిలో నిర్వహించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పుస్తకాలు ఇవ్వడమూ, పరీక్షలు నిర్వహించడమూ సెమిస్టర్ విధానంలోనే జరగనుంది. ప్రస్తుతం ఈ విధానం సిబిఎస్‌ఇ విద్యార్థులకు అమలవుతుంది. ఎన్‌సిఇఆర్‌టి ద్వారా సిబిఎస్‌ఇ సిలబస్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

నివురుగప్పిన నిప్పులా మాచర్ల

- పోలీసు పహారా, పికెట్లు ఏర్పాటు
- భయం గుప్పిట్లో నియోజకవర్గ ప్రజలు
- కొనసాగుతున్న 144 సెక్షన్
- టిడిపి నేత బ్రహ్మారెడ్డిపై హత్యాయత్నం కేసు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మాచర్ల బస్టాండ్‌లో పోలీసు పికెట్లు

పల్నాడు జిల్లా మాచర్లలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలతో ఏర్పడిన ఉద్రిక్తతల తరువాత శనివారం పరిస్థితులు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని నియోజకవర్గ ప్రజలు ఆందోళనతో ఉన్నారు. వైసిపి, టిడిపి మధ్య ప్రారంభమైన ఘర్షణలు చిలికిచిలికి గాలివానగా మారడం, వైసిపి శ్రేణులు రెచ్చిపోయి టిడిపి చెందిన వారి ఇళ్లపై దాడికి పాల్పడ్డం తెలిసిందే. గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు మాచర్లలో మోహరించాయి. పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతోంది. దుకాణాలు, వ్యాపార సంస్థలు పాక్షికంగానే తెరుచుకున్నాయి. పల్నాడు ఎస్‌పి రవిశంకర్ రెడ్డి మాచర్లలో మకాం వేశారు. బయట వారిని మాచర్లలోకి అనుమతించలేదు. బస్టాండ్‌తోపాటు కూడలి ప్రదేశాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటల తర్వాత మాచర్లకు ఆర్‌టిసి బస్సులు నడిపారు. ఎస్.పి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో పరిస్థితులు అదుపులో ఉన్నాయన్నారు. అధిపత్యం కోసం రెండు గ్రూపులు ఘర్షణకు దిగినట్లు తెలిపారు. దాడి జరిగిన ఇంటిలో నగదు, బంగారం అపహరణ జరిగిన వ్యవహారంపై ఎస్పిని విలేకర్లు వివరణ కోరగా, తమ విచారణలో అన్ని అంశాలూ వెలుగులోకి వస్తాయని, వాటిని బట్టి చర్యలు ఉంటాయని ఎస్పి తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి టిడిపి నాయకులు చలో మాచర్లకు పిలుపునివ్వగా వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టులు, గృహనిర్బంధం చేశారు. గుంటూరు, నర్సరావుపేట, పిడుగురాళ్ల, వినుకొండ తదితర ప్రాంతాల్లో, మాచర్లలో వైసిపి విధ్వంసం, దాడులకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగాయి. టిడిపి శ్రేణులు వైసిపికి చెందిన ముగ్గురిని బండరాళ్లతో కొట్టడానికి ప్రయత్నించిన వీడియోలను పోలీసులకు వచ్చింది. దీనిని వారు పరిశీలించారు. మాచర్లలో జరిగిన విధ్వంసంతో మహిళలు బిక్కుబిక్కుమంటున్నారు. తాము ఫిర్యాదు చేసినా ఎవరిపైనా చర్యలు తీసుకుంటారన్న నమ్మకం లేదని మిగతా 2లో

సమ్మెలతో అట్టుడుకుతున్న బ్రిటన్

- పండుగ వేళ కరువవుతున్న ఉత్సాహం

లోపలి పేజీలో..

ఆరుగురు సజీవ దహనం

- ఇంటికి గడియపెట్టి నిప్పు అంటించిన వైనం

బిల్కిస్ బానోకు దక్కని న్యాయం

- దోషుల ముందస్తు విడుదలపై సవాలు పిటిషన్ కొట్టివేత
- మానవ హక్కుల కార్యకర్తల అసంతృప్తి

న్యూఢిల్లీ : గుజరాత్ మత ఘర్షణల సమయంలో హిందూత్వ గూండాల చేతిలో సామూహిక అత్యాచారానికి గురైన బాధితురాలు బిల్కిస్ బానోకు న్యాయం దక్కలేదు. 2002లో ఐదు నెలల గర్భిణిగా ఉన్న బిల్కిస్ బానోపై హిందూత్వ దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో దోషులను ముందస్తుగా విడుదల చేసిన నేపథ్యంలో ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి విదితమే. ఈ కేసులో దోషులకు రెమిషన్ పాలసీని అమల్జేసేందుకు వీలు కల్పిస్తూ మే నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బిల్కిస్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే తాజాగా ఆ పిటిషన్‌ను కొట్టివేసి.. ఆమె న్యాయవాదికి సుప్రీంకోర్టు సిబ్బంది సమాచారం చేరవేశారు. ఈ కేసులో 11 మందిని దోషులుగా నిర్ధారించిన సిబిఐ ప్రత్యేక కోర్టు 2008 జనవరి 21న జీవిత ఖైదు విధించింది. బాంబే హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆగస్టు 15న వీరందరినీ గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడం తీవ్ర దుమారం రేపింది. జైలు నుంచి బయటకు వచ్చిన వారిని మిఠాయిలు, పూలదండలతో సంఘ్ పరివార్ ఘనంగా స్వాగతించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. దీనిపై పునర్విచారణ చేపట్టి సదరు దుండగులను తిరిగి జైళ్లకు పంపాలని దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. బిజెపి, దాని మిత్రపక్షాలు మినహా రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో దోషుల విడుదలను ఆక్షేపించాయి. ఈ నేపథ్యంలో రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఢిల్లీలో ఆందోళన చేస్తున్న అమరావతి రైతులు

జై అమరావతి... జై కిసాన్

- హస్తినలో కదంతొక్కిన అమరావతి రైతులు
- రాజధాని అమరావతిలోనే కొనసాగాలని డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'జై అమరావతి...జై ఆంధ్రప్రదేశ్...జై కిసాన్' అంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై నినాదాలు మార్మోగాయి. ఏపి రాజధానిగా అమరావతే కొనసాగాలని నినదించారు. 'ధరణి కోట నుంచి ఎర్ర కోటకు' పేరుతో అమరావతి రైతులు కందం తొక్కారు. చరిత్రలో రైతులను కంటతడి పెట్టించిన ఎవ్వరూ బాగుపడలేదన్నారు. అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) ఆధ్వర్యంలో శనివారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. ఈ ఆందోళనకు సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, జనసేన తదితర పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అమరావతి రైతు ఉద్యమం, రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. అమరావతిని నిర్మించాలని, ఆంధ్రప్రదేశ్‌ను రక్షించాలని మోడీ, అమిత్ షాకు విజ్ఞప్తి చేస్తూ ప్లకార్డులను రైతులు చేబూని నినాదాల హెూరెత్తించారు.

ప్రజలను మోసగించిన మోడీ, జగన్ : డి రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ రాజధాని రైతుల డిమాండ్‌కు తమ పార్టీ మద్దతు ఉందని స్పష్టం చేశారు. ఏపిలో చాలా తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నెలకొందని, కేంద్రం నుంచి ఏపికి రావల్సిన నిధులు రావటం లేదని అన్నారు. రాజధాని సమస్యను కొనసాగించే ధోరణిని వైఎస్ జగన్ విడనాడాలని హితవు పలికారు. అమరావతి రాజధానిగా కొనసాగుతోందని సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రకటించి, ఈ సంక్షోభానికి ముగింపు పలకాలని సూచించారు. లేకపోతే డిమాండ్ సాధన కోసం తామంతా ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు. ఒకవైపు ఏపికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా బిజెపి మోసం చేస్తుందని, మరోవైపు భూములిచ్చిన అమరావతి రైతులను జగన్ మోసం చేశారని విమర్శించారు.

రైతులవైపే న్యాయస్థానాలు : రామ్మోహన్ నాయుడు

టిడిపి ఎంపి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ అమరావతి రైతు ఉద్యమం మూడేళ్లుగా జరుగుతోందన్నారు. అమరావతిని నాశనం చేయాలని సిఎం జగన్ కంకణం కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానాలు కూడా రాజధాని రైతులవైపే న్యాయం ఉందని చెప్పాయని అన్నారు. ఎంపి రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ రైతులను వైసిపి ప్రభుత్వం దగా, మోసం చేసిందని, అమరావతిలో 80 శాతం చిన్న, సన్నకారు ఎస్‌సి, బిసి రైతులే ఉన్నారని తెలిపారు.

ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధాని మారదు : అరుణ్ కుమార్

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతికూల వాతావరణంలోనూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లకు తమ పార్టీ మద్దతు ఉంటుందని అన్నారు. రాజధాని నిర్మాణానికి మట్టి, నీరును తెచ్చి మిగతా 2లో

చెప్పులు చూపుతున్న వైసిపి అసమ్మతి నాయకులు

మంత్రి పెద్దిరెడ్డికి నిరసన సెగ

- ఎమ్మెల్యే శంకరనారాయణకు మళ్లీ టికెట్టు ఇవ్వొద్దంటూ నినాదాలు
- చెప్పులు చూపుతూ వైసిపి అసమ్మతి నేతల ఆందోళన

ప్రజాశక్తి- పెనుకొండ (సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో అధికార వైసిపిలో అసమ్మతి బహిర్గతమైంది. మంత్రి పెద్దిరెడ్డికి నిరసన సెగ తగిలింది. 'జగన్ ముద్దు... పెనుకొండ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షుడు శంకరనారాయణ వద్దు' అంటూ నినాదాలు హోరెత్తాయి. శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి పెనుకొండ నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని పెనుకొండలోని మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వైసిపి రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చారు. మంత్రి కారు వెనుక వేరే కారులో ఎమ్మెల్యే శంకరనారాయణ అనుసరిస్తున్నారు. పెనుకొండ సమీపంలోని వై.జంక్షన్ వద్ద మంత్రి కారును వైసిపి అసమ్మతి నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. 'ఈ ఎమ్మెల్యే మాకొద్దు. శంకరనారాయణకు మళ్లీ టికెట్టు ఇవ్వొద్దు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే గత మూడున్నరేళ్లలో తన సోదరులతో కలిసి అవినీతికి పాల్పడ్డారంటూ, వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెట్టించారంటూ మంత్రికి గోరంట్ల సీనియర్ నాయకులు గంపల రమణారెడ్డి, బ్రహ్మసముద్రం శ్రీనివాసులు, సంజీవరెడ్డి, దిలీప్ రెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొందరు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు చెప్పులు చూపించారు. అసమ్మతి నేతల నిరసనలు, నినాదాల నడుమే మంత్రి పెద్దిరెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి వెనుదిరిగారు.

ట్విట్టర్‌లో 'కూ' నిలిపివేత

వాషింగ్టన్ : భారత మైక్రో బ్లాగింగ్ వేదిక 'కూ' ఖాతాను ట్విట్టర్ సంస్థ నిలిపివేసింది. వినియోగదారుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి కూ ట్విట్టర్‌లో ఏర్పాటు చేసుకున్న ఖాతాను శనివారం సస్పెండ్ చేసింది. ఎలన్‌మస్క్ ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న తరువాత ఆయనకు వ్యతిరేకంగా వార్తలు రాసే పలువురు పాత్రికేయుల ఖాతాలను రద్దు చేశారు. ఆ క్రమంలోనే ట్విట్టర్ తరహాలోనే సేవలందించే అనేక బ్లాగింగ్ వేదికల ఖాతానలు కూడా నిలిపివేశారు. ఇటీవలే మాస్టోడాన్ అనే మైక్రో బ్లాగింగ్ వేదిక ఖాతాను నిలిపివేసిన ట్విట్టర్ తాజాగా భారత్‌కు చెందిన 'కూ' ఖాతాపై కూడా వేటు వేసింది. 'కూ' కూడా ట్విట్టర్ తరహాలోనే సంక్షిప్త సమాచారాన్ని, అభిప్రాయాలను షేర్ చేసే సేవలను భారత్‌లో అందిస్తుంది. ఇటీవలే ఆ సంస్థ తన వినియోగదారుల సంఖ్య 5 కోట్లకు చేరిందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ట్విట్టర్ తాజా నిర్ణయం వెలువడింది.

రామకృష్ణ బహిష్కరణ

- ఎపి గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జిఎంపిఎస్) నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం రామకృష్ణను బహిష్కరించినట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా శ్రీరామ్, కిలారి పెద్దబ్బాయి తెలిపారు. ఈ మేరకు వారొక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక అరాచకాలకు, సంఘం విచ్ఛిన్నానికి రామకృష్ణ పాల్పడ్డారని వివరించారు. రాష్ట్ర బాధ్యులతో సంబంధం లేకుండా రామకృష్ణ ఒక్కరే ఖాతాను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటికి సంబంధించిన జమా ఖర్చులు చెప్పలేదని, బ్యాంకు లావాదేవీలు అప్పగించలేదని వివరించారు. సంఘంలో చురుగ్గా లేనందున గతంలోనే కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పించామని వెల్లడించారు. అక్కౌంట్స్‌లో తీవ్రమైన ఆర్థిక అవకతవకలకు పాల్పడినందుకు అతనిని సంఘంలో అన్ని బాధ్యతల నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకందారుల సొసైటీ పేరుతో అతను తన సొంత అవసరాల కోసం ప్రభుత్వాధికారులు, సంస్థలు, కొంతమంది వ్యక్తుల వద్ద నిధులు సేకరిస్తున్నట్లు సంఘం దృష్టికి వచ్చిందని వివరించారు. అతనికి, తమ సంఘానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.

కౌలు రైతులకు నేడు పవన్ సాయం

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ , నరసరావుపేట (పల్నాడు జిల్లా)

జనసేన పార్టీ చేపట్టిన రైతు భరోసా యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆదివారం 280 మంది కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్టు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అంతకు ముందు గుంటూరు, నరసరావుపేటలో మీడియాతో మాట్లాడారు. రైతుల్లో భరోసా నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పోలీసులు కూడా సహకరించాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కౌలు రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్నాయని, సుమారు 280 మందికి పైగా కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబాల వారిని ఇబ్బంది పెడుతోందని, జనసేన నుంచి రూ. లక్ష తీసుకొంటే ప్రభుత్వం ఇచ్చే ఇతర సదుపాయాలు పోతాయని భయపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో గత మూడేళ్లలో మూడు వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు.

పౌర సరఫరాలశాఖలోకి ఆర్థిక శాఖ అధికారులు

- తక్షణమే ఎన్ఒపి అమలుకు ప్రభుత్వ చర్యలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

ప్రజలతో కీలక సంబంధాలున్న పౌర సరఫరాల శాఖలో చోటుచేసుకుంటున్న ఆర్థిక అవకతవకలను అడ్డుకునేందుకు ఆ శాఖలోకి ఆర్థిక శాఖ అధికారులను డిప్యుటేషన్‌పై పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఇదే అంశంపై చర్చించారు. ప్రధానంగా నెల్లూరు జిల్లా పౌరసరఫరా శాఖలో అక్రమాలు వెలుగుచూసిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ శాఖలో ఆర్థిక విధానాలను అమలు చేసేందుకు ఒక స్టాండింగ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను తీసుకురావాలని కూడా నిర్ణయించారు. నెల్లూరు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఇటీవల ఆర్థిక అక్రమాలు వెలుగు చూడడంతో దానిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై వివరాలను సేకరించిన సిఎం ఆర్థిక అవకతవకలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు తెల్చిచెప్పారు. దీనికోసం ఎస్ఒపిని కూడా రూపొందించారని చెప్పడంతో అధికారులు ఆ మేరకు కసరత్తు ప్రారంభించారు. పౌరసరఫరాల శాఖ అధికారుల్లో ఆర్థికపరమైన అంశాలపై స్పష్టత పెంచేందుకు ఆ శాఖలోకి ఆర్థిక శాఖతోపాటు ఆడిట్ శాఖ, గణాంక శాఖలనుంచి కూడా అధికారులను డిప్యుటేషన్‌పై పంపించాలని నిర్ణయించారు. అయితే ఏ స్థాయి అధికారులను డిప్యుటేషన్‌పై పంపించాలనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

నివురుగప్పిన నిప్పులా మాచర్ల

(మొదటిపేజీ తరువాయి)

పలువురు మహిళలు వాపోయారు.

టిడిపి వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు, వైసిపి వారిపై బెయిల్‌బుల్ కేసులు

మాచర్లలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో టిడిపి నాయకులపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు, వైసిపి నాయకులపై బెయిల్‌బుల్ కేసులు నమోదయ్యాయి. రేషన్ డీలర్ చల్లా మోహన్ ఫిర్యాదుతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డితో సహా తొమ్మిది మందిపై సెక్షన్ 307 ప్రకారం హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. టిడిపి కార్యకర్త యర్రం పోలిరెడ్డి భార్య అన్నపూర్ణ ఫిర్యాదుపై వైసిపికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ తురగా కిషోర్‌తోపాటు పది మందిపై కేసు నమోదు చేశామని, టిడిపి కార్యాలయంపై దాడి, కార్ల దహనం, ఇళ్లపై దాడికి సంబంధించిన 323, 448, 143, 147 సెక్షన్ల కింద వారిపై కేసులు నమోదు చేశారని చెప్పారు.

చలో మాచర్ల భగ్నం

- టిడిపి నేతల గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులు
- వైసిపి కార్యకర్తలను పరామర్శించిన మంత్రి అంబటి, ఎమ్మెల్యేలు
- అజ్ఞాతంలోకి వెళ్లిన బ్రహ్మారెడ్డి

నరసరావుపేటలో రాస్తారోకో చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/మాచర్ల/నర్సరావుపేట

టిడిపి చేపట్టిన చలో మాచర్లను శనివారం పోలీసులు భగ్నం చేశారు. గుంటూరులో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, దూళిపాళ్ల నరేంద్రను తొలుత గృహనిర్బంధం చేయగా.. తప్పించుకుని గుంటూరు జిల్లా టిడిపి కార్యాలయానికి చేరుకున్నారు. టిడిపి కార్యాలయం నుంచి బయటకు రాగానే వీరితో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలను అరెస్టుచేసి నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. గుంటూరులో ధర్నా చేస్తున్న నగర టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్, తూర్పు, పశ్చిమనియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు నశీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర తదితరులను అరెస్టు చేశారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లో ఉంచి విడుదల చేశారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావును, నరసరావుపేటలో కోడెల శివరామ్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు. టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను విజయవాడ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బ్రహ్మారెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయనతో పాటు తొమ్మిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.అజ్ఞాతం నుంచి బ్రహ్మారెడ్డి ఓ వీడియో విడుదల చేశారు. శుక్రవారం రాత్రి రాజబోయిన మధు, యర్రం పోలిరెడ్డి, వజ్రం నాయక్, ఇళ్ళను ధ్వంసం, బండ్ల శ్రీను కిరాణా దుకాణంపై దాడి చేయటం, పార్టీ కార్యాలయాన్ని తగలబెట్టినట్లు చెప్పారు.

పిన్నెల్లి సోదరులను హత్య చేసేందుకు టిడిపి కుట్ర : అంబటి

మాచర్లలో టిడిపి నాయకులే వైసిపి శ్రేణులను రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడి వివాదం సృష్టించారని మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. నరసరావుపేటలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్తలను అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేశ్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే పిన్నెల్లిని ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డిని హత్య చేసేందుకు భారీ కుట్ర జరుగుతుందన్నారు. ఈ ఘటనకు చంద్రబాబు నాయుడు బాధ్యత వహించాలని మంత్రి విడుదల రజని అన్నారు.

వడ్డెర సంఘం ధర్నా

ఈ ఘటనకు పూర్తి బాధ్యత చంద్రబాబు, లోకేష్‌దేనని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు.

పోలీసుల వైఫల్యం : బిజెపి

మాచర్లలో శాంతి భద్రతలు కాపాడటంలో పోలీసు యంత్రాంగం ఘోర వైఫల్యమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడిన తీరు ఆక్షేపణీయమన్నారు.

లా అండ్ ఆర్డర్ లోపించింది : సిపిఐ

ఎపిలో లా అండ్ ఆర్డర్ లోపించిందనడానికి మాచర్ల ఘటన ఉదాహరణని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలపై వైసిపి నాయకుల దాడులు, అరాచకాలు పెరిగిపోతున్నాయని వివరించారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే మాచర్ల ఘటన : టిడిపి నేతలు

మాచర్లలో హింసకు ప్రభుత్వ ప్రోత్సాహకమేనని, పోలీసుల కనుసన్నల్లోనే విధ్వంసకాండ జరిగిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సాగిస్తున్న మారణ హోమానికి భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవడం ఖాయమని పిఎసి చైర్మన్ పయ్యావుల కేశవ్ హెచ్చరించారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. మాచర్ల ఘటన చూసిన తర్వాత రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికుందా అనే అనుమానం ఏర్పడుతోందని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి సీతారామాంజనేయులు, పల్నాడు ఎస్‌పి రవిశంకర్ రెడ్డి పర్యవేక్షణలోనే హింస జరిగిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు.

పోటీల్లో ప్రతిభే గీటురాయి

- ముగింపు ఉత్సవాల్లో మంత్రి రోజా, సంపూర్ణేష్ బాబు
- ఓవరాల్ ఛాంప్ గుంటూరు బిహెచ్ కళాశాల

ఓవరాల్ ఛాంప్ గుంటూరు బిహెచ్ కాలేజీ టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి రోజా, సంపూర్ణేష్ బాబు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున వర్సిటీ వేదికగా మూడురోజులు నిర్వహించిన అంతర్ కళాశాలల అనుసృజన-2022 యువజనోత్సవాలు అట్టహాసంగా శనివారం ముగిశాయి. మొత్తం 23 ఈవెంట్లలో జరిగిన పోటీల్లో అనుబంధ కళాశాలల కేటగిరిలో 74 మార్కులు సాధించిన గుంటూరుకు చెందిన బండ్లమూడి హనుమాయమ్మ మహిళా కళాశాల ఓవరాల్ ఛాంపియన్ షిప్ దక్కించుకుంది. రన్నర్స్‌గా గుంటూరు హిందూ కళాశాల, తృతీయ స్థానంలో విజ్ఞాన్స్ కళాశాల నిలిచింది. యూనివర్సిటీ కళాశాలల కేటగిరిలో ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల 42 మార్కులతో ఛాంపియన్‌గా నిలువగా, రెండవ స్థానంలో సైన్స్ కళాశాల నిలిచింది. విజేతలకు రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఆర్‌కె.రోజా, సినీ నటుడు సంపూర్ణేష్ బాబు, ఎఎన్‌యు విసి ఆచార్య రాజశేఖర్ తదితరులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ.. నేటితరం యువతకు ఎన్నో రకాల అవకాశాలున్నాయని, వాటిని ప్రతిభతో అందిపుచ్చుకోవాలని సూచించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద ప్రదర్శనలు రాబోవు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, అల్లరి చేయొచ్చు కానీ దానికీ హద్దులుంటాయని అన్నారు.

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. యువజనోత్సవాల్లో చూపే ప్రతిభ విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలుపుతోందన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ .. వచ్చే ఏడాది యూనివర్సిటీ వేదికగా సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల యువజనోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. ముందుగా యువజనోత్సవాల కో-ఆర్డినేటర్ ఆచార్య కె. సునీత నివేదికను వివరించారు. రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, ప్రిన్సిపల్స్, కో-ఆర్డినేటర్లు, యువజనోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జై అమరావతి... జై కిసాన్

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారని, దేశానికి ఒక చిహ్నంగా ఉండే బ్రహ్మాండమైన రాజధానిని నిర్మిస్తారని అనుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అటు విభజన హామీలను నెరవేర్చకుండా మోసం చేసి.. రాజధాని విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ద్రోహం చేస్తోందన్నారు. రాజధానిని ఒకసారే నిర్ణయిస్తారని, అంతేతప్ప ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులు మారడం సరైనది కాదని పేర్కొన్నారు. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేయాలని కోరుకోవడమంటే, ఏపిలో అమరావతి ఒక్కటే అభివృద్ధి చెందాలని కోరుకోవడం కాదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఈ పోరాటం అమరావతి అభివృద్ధి కోసమే పరిమితం కాకూడదని, మొత్తం రాష్ట్రం అభివృద్ధి కోసం ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రజలందరినీ కలుపుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని సూచించారు.

బిజెపి డ్రామాలొద్దు...సత్తా ఉంటే చేయాలి : జెడి శీలం

మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం మాట్లాడుతూ అమరావతి విషయంలో బిజెపి డ్రామాలాడొద్దని, చిత్తశుద్ధి ఉంటే చెప్పేది చేయాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలపై కట్టుబడి ఉండాలని, అబద్ధాలు చెప్పొదని సూచించారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రైతుల కంటతడి పెట్టించిన ఏ నాయకుడూ బాగుపడినట్లు చరిత్రలో లేదని అన్నారు.

మోడీ మౌనమేల : బిఎస్‌పి ఎంపీ అలీ

బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ మాట్లాడుతూ అమరావతికి భూమి పూజ చేసిన ప్రధాని మోడీ, ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అమరావతి రైతులకు న్యాయం ఎవరు చేస్తారని ప్రశ్నించారు. రైతులకు కలలు చూపించారని, ఆ కలలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత ఒక్కటే కాదని, కేంద్రానిది కూడా బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

కేంద్రం జోక్యం చేసుకోవాలి : సిపిఎం ఎంపి శివదాసన్

సిపిఎం ఎంపి వి.శివదాసన్ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా వైఎస్ జగన్ ప్రతిపక్షనేతగా మద్దతు ఇచ్చారని, కానీ సిఎంగా ఎన్నికైన తరువాత తన వైఖరి మారిందని విమర్శించారు. ఇది పూర్తిగా రైతులను మోసం చేయడమేనని అన్నారు. అమరావతి రైతుల అంశం పార్లమెంట్ ఉభయ సభల్లో వామపక్ష ఎంపిలు లేవనెత్తుతామని తెలిపారు. సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత, ప్రాంతాలు వారీగా ప్రజలను విడగొడుతోందని విమర్శించారు. అమరావతిని రాజధానిగా కొనసాగించడం చారిత్రాత్మక అవసరమని, మూడు రాజధానుల వైఖరి ఆపాలని డిమాండ్ చేశారు.

టిడిపి ఎంపిలు గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎంపి అజీజ్ భాషా, ఏపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ చౌదరి, ఆప్ ఎంపి సుశీల్ కుమార్ గుప్తా, భారతీయ కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మహిమానంద మిశ్రా, తాడికొండ మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, అమరావతి రైతుల జెఎసి నేతలు శివారెడ్డి, తిరుపతిరావు, రాయపాటి శైలజ, కంభంపాటి శిరీష, రాధిక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉక్కు దీక్షల్లో కూర్చున్న పెన్షనర్లు

'ఉక్కు' దీక్షకు పెన్షనర్ల మద్దతు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 674వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతు తెలిపారు. దీక్షా శిబిరంలోనే పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్‌రావు, విశాఖ జిల్లా అధ్యక్షులు దీనబంధు, ఉపాధ్యక్షులు వర్మ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, జె.అయోధ్యరామ్ మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం అత్యంత దుర్మార్గమైనదన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే స్థానికులతోపాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ఉక్కు పోరాటంలో ఎక్కడికక్కడ పెన్షనర్లు పాల్గొం టున్నారని, భవిష్యత్తులోనూ ఈ ఉద్యమంలో భాగస్వాములవుతారని తెలిపారు. ప్రభుత్వం కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో నాయకులు వై.కృష్ణారావు, మాటూరి శ్రీనివాసరావు, ఎం.కృష్ణారావు, డి.వసంతరావు, రఫీ, విశ్రాంత ఉద్యోగులు కూర్చున్నారు.

పనిలో వేగం, నాణ్యతతో ముందుకు సాగండి

ఎయు పూర్వ విద్యార్థుల సమావేశంలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

యువత పనిలో వేగం, నాణ్యతతో ముందుకు సాగాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్.నారాయణమూర్తి అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శనివారం ఉదయం వర్సిటీలో కొద్దిసేపు సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఎయు పరిపాలనా భవనం వద్దకు చేరుకున్న నారాయణమూర్తికి వైస్ చాన్సలర్ పివిజిడి.ప్రసాదరెడ్డి, పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఎయు పూర్వ విద్యార్థి, జిఎంఆర్ సంస్థల చైర్మన్ జి.మల్లికార్జునరావు నారాయణమూర్తిని తోడ్కొని వచ్చారు. అక్కడ వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి వర్సిటీ వ్యవస్థాపన, విశిష్టతలను నారాయణమూర్తి తెలుసుకున్నారు. అనంతరం ఎయు ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటైన ఆ-హబ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించారు. అంకుర పరిశ్రమలను ప్రోత్సహిస్తున్న విధానం, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలను ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ రవి ఈశ్వరపు వివరించారు. ఎయు-నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను పరిశీలించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డ్రీమ్‌వాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ఎయులో చదువుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రమాలు నిర్మించిన జిఎంఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఖర్చును నియంత్రించే పద్ధతులను అలవర్చుకోవాలని తెలిపారు. క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ జి.మల్లికార్జునరావు మాట్లాడుతూ విజయానికి విద్య దోహదపడుతుందని తెలిపారు. విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలన్నారు.

నారాయణమూర్తికి ఘన స్వాగతం పలుకుతున్న ఎయు సిబ్బంది, పూర్వ విద్యార్థులు

అనంతరం రూ.45 లక్షల వ్యయంతో ఆధునీకరించిన ఇంజినీరింగ్ కళాశాలలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంను, జియో ఇంజినీరింగ్ విభాగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన జియో ఫొటోగ్రామెట్రీ ప్రయోగశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి కృపాకర్ పాల్, ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆచార్య బీల సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరుద్యోగం, మత్తు అంశాలపై యువత పోరాడాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువతను కబలిస్తున్న మత్తు, నిరుద్యోగం అంశాలపై పోరాటం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌నకు రెండో రోజైన శనివారం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో, రాష్ట్రంలో జనాభాలో 50శాతంపైగా ఉన్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా రోడ్డునపడ్డారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం, ఉపాధి అవకాశాలు కనుమరుగవడంతో కొంతమంది యువత మత్తుకు బానిసగా మారుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇప్పటివరకు కల్పించలేదని విమర్శించారు. కరోనా కారణంగా ఉన్న ఉద్యోగాలను యువత కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి, తక్కువ సంఖ్యలో పోస్టులను చూపుతూ నోటిఫికేషన్ ఇచ్చిందని విమర్శించారు. స్థానికంగా ఉపాధి లేకపోవడం, ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోవడంతో యువత తీవ్ర ఇబ్బందులు పడుతోందని తెలిపారు. కరువు ప్రాంతాల్లో వేలాదిమంది నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తుకు వ్యతిరేకంగా, ఉపాధి అవకాశాల కోసం యువత పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాలపై పిడుగు

- ఇకపై గ్యారంటీలన్నీ బడ్జెట్‌లోనే
- ఆ మొత్తం కూడా అప్పుల్లోకి జమ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రాలు తన ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే గ్యారంటీలపై కేంద్రం షాక్ ఇచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వరంగ సంస్థలు ఇచ్చే గ్యారంటీలను కూడా బడ్జెట్‌లోనే ప్రతిపాదించాలని నిర్ణయించారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొనే మొత్తం రుణాలలో గ్యారంటీలు కూడా భాగంగా మారిపోనున్నాయి. కేంద్రం ఇటీవల ఏర్పాటు చేసిన వర్క్ షాప్ లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు, హర్యానా, ఒడిషా, కర్ణాటక, జమ్ము-కాశ్మీర్‌లు పాల్గొన్నాయి.దీంతో పాటు గ్యారంటీలన్న పదం స్థానంలో ఇక నుండి 'లెటర్ ఆఫ్ కంఫర్ట్', 'లెటర్ ఆఫ్ క్రెడిట్' అనే పదాలను ఉపయోగించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే, గ్యారంటీలను కూడా అప్పుల్లో భాగంగా చూపినందువల్ల రాష్ట్రాల రుణపరిమితి తగ్గిపోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం గ్యారంటీలపై దేశవ్యాప్తంగా ఒక విధానమంటూ లేకుండాపోయిందని దానిని సరిదిద్దడానికి ఈ విధానాన్ని రూపొందించినట్లు చెబుతున్నారు. గ్యారంటీల్లో రిస్క్ బేస్డ్ అధ్యయనం కూడా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. గ్యారంటీలకు సంబంధించి అనేక రాష్ట్రాలు భిన్న విధానాలను అవలంబిస్తున్నాయని, ఇది సరికాదని చర్చలో పేర్కొన్నారు. ఇస్తున్న గ్యారంటీలు ఇండియన్ గవర్నమెంట్ అకౌంటింగ్ స్టాండర్డ్ (ఐజిఎఎస్) మేరకే ఉండాలని, ప్రతి రాష్ట్రం తాము ఇస్తున్న గ్యారంటీలను నిర్దిష్ట నమూనాలో రిజర్వుబ్యాంక్, కేంద్ర ప్రభుత్వాలకు అందించాలని కూడా అ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వరంగ సంస్థలకు గ్యారంటీలపై రుణాలు ఇచ్చే బ్యాంకులు కూడా ఆయా సంస్థల రుణ చెల్లింపులు, రుణ అవసరాలపైన దృష్టి సారించాలని పేర్కొన్నారు. రాష్ట్రాలు తీసుకొనే రుణ వివరాలు, గ్యారంటీల వివరాలు ఎప్పటికప్పుడు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయానికి కూడా సమర్పించాల్సి ఉంటుందని సమావేశంలో స్పష్టం చేశారు.

టైటిల్ విజేత పింక్ ప్యాంథర్స్

- ఫైనల్లో పుణేరిపై 33-29పాయింట్లతో గెలుపు

ముంబయి: ప్రో కబడ్డీ సీజన్-9 టైటిల్‌ను జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్టు గెలుచుకుంది. చివరి పాయింట్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో పింక్ ప్యాంథర్స్ 33-29పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్స్‌పై విజయం సాధించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 3పాయింట్ల ఆధిక్యతను సంపాదించిన జైపూర్ జట్టు చివరి 30సెకన్ల సమయంలో ఇరుజట్లు పోటాపోటీగా ఆడాయి. ఆ సమయానికి జైపూర్ 31-29పాయింట్ల ఆధిక్యతలో ఉండగా.. 29సెకన్ల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో జైపూర్ రైడర్ క్రాస్ లైన్ వద్దే కూర్చోగా.. పుణేరి జట్టు ఒక పాయింట్‌ను చేజార్చుకొంది. ఆ దశలో చివరి రైడ్‌కు వెళ్లిన పుణేరి ఆటగాడిని నియంత్రించే క్రమంలో జైపూర్ ఆటగాళ్లు చివర్లో ట్యాకిల్ చేయడంతో జైపూర్ విజయం ఖాయమైంది. దీంతో జైపూర్ జట్టు 2014(ఆరేళ్ల) తర్వాత మరోసారి టైటిల్‌ను ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు బాలీవుడ్, టాలీవుడ్ నటులు హాజరుకావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. జైపూర్ ఫ్రాంచైజీ యాజమాని అభిషేక్ బచ్చన్-ఐశ్వర్య బచ్చన్‌తోపాటు కుటుంబ సభ్యులు హాజరుకాగా.. పుణేరి పల్టన్స్‌కు రణవీర్ సింగ్-పూజా హెగ్డే మద్దతుగా నిలిచి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.

ప్రో కబడ్డీ సీజన్-9 ఉత్తమ ఆటగాళ్లు..
బెస్ట్ డిఫెండర్ : అంకుష్(జైపూర్)
యంగ్ ప్లేయర్ ఆఫ్ సీజన్-9: నరేందర్(తమిళ్ తలైవాస్)
మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్: అర్జున్ దేశ్‌వాల్(జైపూర్)
ప్రైజ్‌మనీ:
విజేత: జైపూర్-రూ.3కోట్లు, రన్నరప్: పుణేరి పల్టన్స్‌గీరూ.1.5కోట్లు,
సెమీస్: తమిళ్ తలైవాస్, బెంగళూరు బుల్స్: రూ.90లక్షలు

బియ్యం గోధుమ ధరలు పైపైకే!

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పత్తి తగ్గడంతో పాటు, అంతర్జాతీయ పరిణామాలు కూడా గోధుమలకు డిమాండ్‌ను పెంచాయి. మరోవెపు ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా గత ఏడాదితో పోలిస్తే 6.05శాతం ఉత్పత్తి తగ్గుతుందని భావిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో కూడా బియ్యం, గోధుమల ధరలు మరింత పెరగనున్నాయి.

ఆరేళ్ల కనిష్టానికి గోధుమ నిల్వలు

దేశంలో గోధుమల నిల్వలు ఆరేళ్ల కనిష్టానికి చేరాయి. ఒకవైపు మార్కెట్‌లో గోధుమ ధరలు అనూహ్యంగా పెరుగుతుండగా మరోవైపు ఈ పరిణామం చోటుచేసుకుంది. భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం సెంట్రల్ పూల్‌లో 19.02 మిలియన్ టన్నుల గోధుమలు మాత్రమే నిల్వ ఉన్నాయి. 2016 డిసెంబర్‌లో దేశంలో గోధుమల నిల్వలు 16.5 మిలియన్ టన్నులకు పడిపోయాయి. ఆ తరువాత ఈ స్థాయికి నిల్వలు పడిపోవడం ఇదే మొదటిసారి. దీంతో ఆహార రంగ నిపుణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, అధికారయంత్రాంగం మాత్రం ప్రస్తుతం అవసరమని అంచనా వేసిన దానికన్నా అధికంగానే నిల్వలు ఉన్నాయని చెపుతున్నారు. అదే సమయంలో పార్లమెంటులో చేసిన ప్రకటనలో గోధుమ నిల్వలు ఇంకా తగ్గే అవకాశం ఉందని,జనవరి ఒకటవ తేదికి 15.9 మిలియన్ టన్నులకు పడిపోతాయని ప్రభుత్వం పేర్కొంది. అయితే అవసరమైన కనీస నిల్వల కన్నా ఎక్కువగానే ఉంటాయని తెలిపింది. సెంట్రల్ పూల్‌లో జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం సంక్షేమ పథకాలకు, అదేవిధంగా ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన(పిఎంజికెఎవై) పథకం కింద లబ్ధిదారులకు సరఫరాకు ఎటువంటి ఆటంకం ఉండదని కేంద్రం వివరించింది. అయితే, పిఎంజికెఎవై పథకాన్ని డిసెంబర్ 31వ తేది తరువాత కూడా కొనసాగిస్తారా, నిలిపివేస్తారా అన్న విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదు. అయితే, ఒక వేళ పథకాన్ని కొనసాగిస్తే కొరత తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దేశంలో గోధుమల సాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయ శాఖ చెబుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు 28.65 మిలియన్ హెక్టార్లలో గోధుమలు సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 0.82 మిలియన్ హెక్టార్లు ఎక్కువ. అదేసమయంలో సాధారణంగా ప్రతి సంవత్సరం 30.5 మిలియన్ హెక్టార్లలో గోధుమలు సాగు అవుతుండటం గమనార్హం.

ఆరుగురు సజీవ దహనం

ఇంటికి గడియపెట్టి నిప్పు అంటించిన వైనం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాత్రివేళ ఇంట్లో నిద్రిస్తున్న ఆరుగురు తెల్లారేసరికి సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం గుడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివాహేతర సంబంధమే ఈ ఘాతుకానికి కారణమని స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మాసు శివయ్య (50), పద్మ (45) భార్యాభర్తలు. సింగరేణిలో మైనింగ్ సర్దార్‌గా పనిచేస్తున్న శనిగరపు శాంతయ్య (50) కూడా కొన్నాళ్లుగా వారితోనే ఉంటున్నాడు. పద్మతో శాంతయ్యకు వివాహేతర సంబంధం ఉందని, అందువల్లే ఇంటికి రావడంలేదని శాంతయ్య భార్య, కుమారులు పలుసార్లు పద్మను నిలదీశారు. కొద్ది రోజుల క్రితం శాంతయ్యపై హత్యాయత్నం కూడా జరిగింది. ఈ క్రమంలోనే శనివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి లోపలివారు బైటకురాకుండా గడియపెట్టి ఇంటికి నిప్పంటించారు. శివయ్య, పద్మ, శాంతయ్యతోపాటు చుట్టపుచూపుగా వచ్చిన పద్మ సోదరి కుమార్తె మౌనిక (33), ఆమె ఇద్దరు పిల్లలు సజీవ దహనమయ్యారు. తమ ఆస్తిని పద్మకు రాసిస్తాడనే శాంతయ్య కుమారులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ పెయింట్ డబ్బా పేలి ఒకరు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి (పశ్చిమగోదావరి)

ఖాళీ పెయింట్ డబ్బా పేలి ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా ఆగిరిపల్లి మండలంలోని తాడేపల్లి చొప్పరమెట్ల గ్రామంలోని కెకెఆర్ హ్యాపీ స్కూల్లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. స్కూల్లో వాడిపడేసిన పెయింట్ డబ్బాలను కొనుగోలు చేసేందుకు విజయవాడకు చెందిన కుమ్మర కిషోర్ స్కూలుకు వచ్చారు. డబ్బాలను తీసుకెళ్లేందుకు కిషోర్‌తో పాటు వసుధ దుర్గాప్రసాద్, సాంతల మణి, దేవత ప్రసాద్ వెంట వచ్చారు. డబ్బాల మూతలను దుర్గాప్రసాద్ (48) ఓపెన్ చేస్తుండగా.. ఒత్తిడికి గురై ఒక్కసారిగా డబ్బా పేలిపోయింది. దీంతో అతని కాలికి తీవ్రగాయమవ్వడంతో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మరణించారు. ముగ్గురికి గాయాలయ్యాయి. మృతిచెందిన కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

పెన్షన్ విశ్రాంత ఉద్యోగికి భిక్ష కాదు హక్కు

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశ్రాంత ఉద్యోగికి పెన్షన్ ఆర్థిక భరోసానిస్తుందని మాజీ శాసనమండలి సభ్యులు ఎంవిఎస్ శర్మ అన్నారు. అందుకే గతంలో న్యాయస్థానాలు పెన్షన్ అనేది ప్రభుత్వం వేసే భిక్ష కాదని, ఉద్యోగి హక్కుగా గుర్తించాయని పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్వర్యాన శనివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. ఈ ఎనిమిదేళ్లలో కార్పొరేట్లకు అప్పుల మాఫీ కోసం రూ.10 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించిన ప్రభుత్వాలు, పెన్షనర్లకు ఇచ్చే పెన్షన్లను మోయలేని భారంగా భావించి ఎత్తేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సంపన్నులకు ఇస్తున్న రాయితీలను, ఉద్యోగులకిచ్చే పెన్షన్లు, డిఎలు, సంక్షేమ పథకాలను ఒకే గాడిన కట్టడం నేటి ప్రభుత్వ విధానంలో భాగమైందన్నారు. కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధానాలను అమలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల కనీస అవసరాలు తీర్చడంలేదని తెలిపారు.

పేదలు మరింత పేదలుగా మారి, ధనికులు మరింత సంపన్నులుగా మార్చే విధానాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ విధానాలు మారాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.పార్వతీశం మాట్లాడుతూ అన్ని ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, ఇతర ప్రైవేటు సంస్థల విశ్రాంత ఉద్యోగులందరూ సంఘటితమై ప్రభుత్వాలు అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలపై మరింత శక్తివంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ మూర్తి, వ్యవస్థాపక అధ్యక్షులు విజికె మూర్తి మాట్లాడుతూ పెన్షనర్లు రిటైరై విశ్రాంతి తీసుకునే పరిస్థితి లేదని, వారి హక్కుల కోసం మళ్లీ పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

సభలో రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలకు చెందిన హౌసింగ్, సెట్‌శ్రీ, ఆప్కో, ఎస్‌సి, బిసి కార్పొరేషన్లకు చెందిన విశ్రాంత ఉద్యోగులు, కేంద్ర సంస్థల్లో పని చేసిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

బిఇఎల్ అందుబాటులోకి రావడంతో వెనుకబడిన ప్రాంతాల యువతకు ఉపాధి

ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) పరిశ్రమ త్వరితగతిన అందుబాటులోకి రావడంతో వెనుకబడిన రాయలసీమ యవతకు ఉపాధి అవకాశాలు అందించాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరబోతోందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఐఐసి) ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి ఎపిఐఐసి కార్యాలయంలో శనివారం బిఇఎల్ సమావేశం జరిగింది. ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డితో బిఇఎల్ ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన గోవిందరెడ్డికి సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో అనంతపురం ప్రాజెక్టును వేగంగా అభివృద్ధి చేసేందుకు రూ.384 కోట్లు మంజూరు చేసిందని బిఇఎల్ సభ్యులు ఛైర్మన్ గోవిందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. 2016లో అనంతపురం జిల్లా పాలసముద్రం వద్ద బిఇఎల్ ఆధ్వర్యాన రాడార్ టెస్ట్ బెడ్ ఫెసిలిటీ, రక్షణ రంగ ఉత్పత్తులు (మిస్సైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ కోసం 914 ఎకరాల భూములను కేటాయించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో అనుమతులివ్వడంలో జరిగిన జాప్యాన్ని పరిగణలోకి తీసుకుని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం పారిశ్రామికవేత్తల పట్ల స్నేహపూర్వక స్వభావానికి నిదర్శనమని మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. బిఇఎల్ సమావేశంలో ఎపిఐఐసి బెంగుళూరు బిఇఎల్ డైరెక్టర్లు భాను పి.శ్రీవాత్సవ, వినయ్‌కుమార్ కత్యాల్, మనోజ్ జైన్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ డైరెక్టర్ పార్థసారధి, ఎపిఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రీయ సృజనాత్మక మేళవింపే 'బాలోత్సవం'

ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

చిన్నారుల్లో సృజనాత్మకత, శాస్త్రీయతను వెలికి తీయడమే లక్ష్యంగా తిరుపతిలో శనివారం 'బాలోత్సవం' ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు నెహ్రూ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఐదు వేదికలు ఏర్పాటు చేశారు. అన్నమయ్య వేదికపై జానపద నృత్య ప్రదర్శన, యామిని కృష్ణమూర్తి వేదికపై శాస్త్రీయ నృత్య పోటీలు, శంకరంబాడి వేదికపై దేశభక్తి గీతాలాపన, పూని నాగేశం వేదికపై ఏకపాత్రాభినయం, చాచా నెహ్రూ వేదికపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ శిరీష పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారుల్లోని నైపుణ్యానికి పదును పెట్టేందుకు ఇలాంటి బాలోత్సవాలు దోహదపడతాయన్నారు. సమాజానికి ఉపయోగపడేలా తమను తాము అభివృద్ధి చేసుకుంటూ దేశాభివృద్ధికి సహాయపడాలన్నారు. విలువలతో కూడిన జీవితాలను గడుపుతూ సంఘానికి ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో బాలోత్సవం కమిటీ నిరంతరం కృషి చేయడం అభినందనీయమన్నారు. బాలోత్సవ నిర్వాహకులు నాగార్జున మాట్లాడుతూ.. పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. బాధ్యత గల పౌరులుగా, మూఢనమ్మకాలకు దూరంగా ఉంచేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ జిల్లా కార్యదర్శి ఎం.నాగార్జున, గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కృష్ణానదిలో గల్లంతైన ఐదుగురూ మృత్యువాత

- జిజిహెచ్‌లో మృతదేహాలను సందర్శించిన సిపిఎం నేతలు
- బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్, పెనమలూరు

విజయవాడ యనమలకుదురుకు సమీపంలోని కృష్ణానదిలో ఈతకు వెళ్లి గల్లంతైన ఐదుగురు విద్యార్థుల్లో మిగిలిన ముగ్గురు మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. శుక్రవారం రెండు మృతదేహాలు లభ్యంకాగా, రాత్రి కావడంతో గాలింపు చర్యలకు కష్టంగా ఉండడంతో నిలిపివేశారు. శనివారం ఉదయం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా మిగిలిన మూడు మృతదేహాలు దొరికాయి. విజయవాడ పటమట దర్శిపేటకు చెందిన షేక్ బాజీ (15), దూదేకుల హుస్సేన్ (15), తోట కామేష్ (15), మద్దాల బాలు (17), ఇనకొల్లు గుణశేఖర్ (14) మృతి చెందారు. వీరి మృతదేహాలకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

విద్యార్థుల మృతదేహాలను విజయవాడ ప్రభుతాస్పత్రిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆస్పత్రి మార్చురీ వద్ద మృతదేహాలను తరలించే సహాయ కార్యక్రమాల్లో సిపిఎం నేతలు స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలను మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆదుకోవాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకొని తక్షణమే ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని, ఇప్పటికే నిర్మాణమై ఉన్న ప్రభుత్వ పక్కా ఇళ్లను కేటాయించాలని కోరారు. కృష్ణానదీ తీరప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం నేతలు పి.కృష్ణ, కోటిబాబు, క్రాంతి, గురుమూర్తి, మురహరి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

డేటా బిల్లు అభిప్రాయ సేకరణకు

గడువు పొడిగింపు

కేంద్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ : వ్యక్తిగత డిజిటల్ డేటా ప్రొటెక్షన్ బిల్‌పై అభిప్రాయ సేకరణ గడువును జనవరి 2 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పలువురు వాటాదారుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ బిల్లుపై సంప్రదింపులు, అభిప్రాయాల వెల్లడి కోసం డిసెంబర్ 17 తుది గడువుగా తొలుత ప్రకటించింది. దీన్ని పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. అభిప్రాయాలను మైగౌట్ పోర్టల్ లేదా మంత్రిత్వ శాఖ అధికార ఇ-మెయిల్‌కు పంపడానికి వీలుందని తెలిపింది. ఈ ఏడాది నవంబర్ 18న కేంద్ర ప్రభుత్వం ఈ డిజిటల్ డేటా పరిరక్షణ బిల్లు ముసాయిదాను ప్రజాభిప్రాయ సేకరణకు విడుదల చేసింది.

తొలుత 2019లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ బిల్లుపై అనేక అభ్యంతరాలు వ్యక్తం అవడంతో అది ఆమోదానికి నోచుకోలేదు. ఈ క్రమంలో ఎనభైకి పైగా సవరణలు, పదికిపైగా కీలకమైన సూచనలలో కేంద్రం మరోసారి 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022'ను సిద్ధం చేసి, ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేసింది. ఈ బిల్లులో ముఖ్యంగా దేశ సార్వభౌమాధికారం, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు అవసరమైతే ప్రజల సమ్మతి లేకుండానే వ్యక్తిగత సమాచారాన్ని తీసుకోవచ్చన్న నిబంధనలపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇది వ్యక్తిగత స్వయం ప్రతిపత్తిని మరింతగా దెబ్బతీస్తుందనే ఆందోళన ఉన్నందువల్ల దీనిపై పూర్తి స్థాయి చర్చ జరగవలసిన అవసరం ఉంది. వ్యక్తిగత సమాచార పరిరక్షణ కోసం ఈ తాజా ముసాయిదాలో పేర్కొన్న కొన్ని అంశాలు లోప భూయిష్టంగా ఉన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిఫ్‌పాట్ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న మత్స్యకారులు

'నిఫ్‌పాట్'ను తరలించాలని మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో విషవాయువులను వెదజల్లుతూ ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తోన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ సెంటర్ (నిఫ్‌పాట్)ను జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని ఆ సంస్థ ఎదుట మత్స్యకారులు శనివారం ధర్నా చేశారు. ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నానుద్దేశించి ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ నెల 15న అర్ధరాత్రి నిఫ్‌పాట్‌లోని సిలిండర్ లీకై విష వాయువులు వెలువడ్డాయని, దీంతో స్థానికులు కళ్లు తిరిగి స్పృహ కోల్పోవడం, కిందపడి గాయాలపాలవడం, చాలామందికి గొంతు నుంచి మాట రాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని తెలిపారు. తమకు న్యాయం చేయాలని అడిగిన మహిళపై వన్‌టౌన్ సిఐ చేయి చేసుకోవడం దుర్మార్గమన్నారు. విశాఖ నగరంలో ఎల్‌జి.పాలిమర్స్ ఘటనను చూసైనా అధికారులు, ప్రభుత్వం కళ్లు తెరవాలని కోరారు. ధర్నాలో కొత్త అగ్రహారం కాలనీ అధ్యక్షులు అమ్మోరు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సిఐటియు నేత సుబ్బారావు నిర్బంధం

ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావును పోలీసులు పంజా జంక్షన్‌లోని సిఐటియు కార్యాలయం లో నిర్బంధించారు. పోలీసుల తీరును సిపిఎం సహా పలు ప్రజా సంఘాలు ఖండించాయి.

ఆర్‌టిసిలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

23న జిల్లా కేంద్రాల్లో ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరసనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో ప్రైవేటీకరణ చర్యలు ఆపాలని, ఉద్యోగుల వేతన బకాయిలు సత్వరం చెల్లించాలని, ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సింగిల్ క్రూ డ్యూటీలను దశలవారీగా తొలగించాలని కోరుతూ ఈనెల 23న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎస్.జిలానీ బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యుటిఎస్ మిషన్లను బస్టాండులకే పరిమితం చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే ఇవ్వాలని కోరారు. మూడున్నర నెలలుగా నిలిచిపోయిన డ్రైవర్, కండక్టర్లకు అదనపు గంటలకు పనిచేసిన కాలానికి, ఓవర్ టైమ్ అలవెన్స్ బస్ టిక్కెట్ల సొమ్మును అదే రోజు చెల్లించాలని, సిఎఫ్‌ఎంఎస్‌లో ఉన్న రెండేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను చెల్లించాలని, కరువు భత్యం విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకు స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది : జస్టిస్ శ్రీకృష్ణ

ముంబయి : దేశంలో ప్రజాస్వామ్యం సజావుగా సాగేందుకు.. జర్నలిస్టుల స్వతంత్ర్యాన్ని పరిరక్షించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిఎన్ శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. ముంబయి ప్రెస్ క్లబ్‌లో జరిగిన జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిజంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులకు వార్షిక రెడ్ ఇంక్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'న్యాయమూర్తి, జర్నలిస్టు వృత్తులు రెండూ తప్పనిసరిగా స్వతంత్రంగా ఉండాలి. అవి స్వతంత్రంగా లేకపోతే ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది. స్వాతంత్ర్యం కోల్పోయిన జర్నలిస్టు... తన స్వతంత్రాన్ని కోల్పోయిన న్యాయమూర్తి వలె అపరాధ భావానికి గురవుతాడు' అని ఆయన అన్నారు. వృత్తిలో నిజాయితీ ఉత్తమమైన విధానమని ఆయన తెలిపారు. కాగా, సీనియర్ జర్నలిస్టు టి.జె.ఎస్ జార్జ్‌కు రెడ్‌ఇంక్ అవార్డును ప్రదానం చేశారు. ఈయన సెర్చ్‌లైట్ వార్తాపత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. 2021 జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఓమ్ గౌర్, దైనిక్ భాస్కర్‌లకు అందించారు.

ఏడాదిలో ప్రతీ గ్రామానికి బిఎస్‌ఎన్‌ఎల్ స్పీడ్ నెట్

న్యూఢిల్లీ : ప్రస్తుతం ఏ గ్రామాల్లో అయితే హై స్పీడ్ బ్రాడ్‌బాండ్ అందుబాటులో లేదో ఆ ఊర్లన్నిటికీ బిఎస్‌ఎన్‌ఎల్ స్పీడ్ నెట్‌ను తీసుకురానున్నామని టెలికం శాఖ సెక్రటరీ కె రాజరమన్ అన్నారు. ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ వచ్చే ఏడాది లోగా అన్ని గ్రామాలకు నెట్ సేవలను విస్తరించడానికి ప్రణాళికలు రూపొందించిందన్నారు. దీనికి సంబంధించిన మౌలిక వసతుల కోసం పలు కాంట్రాక్టులను అప్పగించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు.

హైయర్ ఇండియాకు బిఇఇ అవార్డు

రిఫ్రిజిరేటర్ విభాగంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ (బిఇఇ) నుంచి 'మోస్ట్ ఎనర్జీ ఎఫీషియెంట్ అప్లయెన్సస్ ఆఫ్ ద ఇయర్' అవార్డును అందుకున్నట్లు హైయర్ ఇండియా వెల్లడించింది. ఈ గుర్తింపును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా తీసుకున్నట్లు పేర్కొంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ ఇంధన పొదుపు దినోత్సవంలో ఈ అవార్డును పొందినట్లు పేర్కొంది. 5 స్టార్ రేటింగ్ కలిగిన హైయర్ హెచ్‌ఆర్‌డి -1955 డైరెక్ట్ కూల్ రిఫ్రిజిరేటర్ ఏడాదికి 106 యూనిట్లనే వినియోగించి విద్యుత్ పొదుపు చేస్తుందని ఆ కంపెనీ తెలిపింది.

pnb Oriental United Together for the better
पंजाब नैशनल बैंक punjab national bank
జోనల్ శస్త్ర, 6-3-865, 1వ అంతస్తు, మై హోమ్ జూపల్లి, అమీర్‌పేట్, గ్రీన్ లాండ్, హైదరాబాద్-500016.

అనుబంధం-14 (రూల్ 8(1)
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **పంజాబ్ నేషనల్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 26.07.2022 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, తాకట్టుదారు/ హామీదారు: **శ్రీమతి వేమూరి ప్రమీళ &** తాకట్టుదారు/ హామీదారు/పిఓఎ హోల్డర్: **వి. రాజ శేఖర్** మరియు **వి. రవి కిరణ్- మెసర్స్ మార్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ ప్రైవేట్ లిమిటెడ్** వారి ఖాతాలో **వి. రాజశేఖర్** నకు పిఓఎ హోల్డర్‌ను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా 30.06.2022నాటికి నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.9,10,70,372.75 పై.లు (రూపాయలు తొమ్మిది కోట్ల పది లక్షల డెబ్బై వేల మూడు వందల డెబ్బై రెండు మరియు డెబ్బై ఐదు పైసలు మాత్రమే)** ప్లస్ దానిపై వర్తించబడు తదుపరి వడ్డీ& చార్జీలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

తాకట్టుదారు/ హామీదారు పూర్తి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా (హామీదారు/తాకట్టుదారు) మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనపరచుకొన్నారు.**

ప్రత్యేకించి హామీదారు/తాకట్టుదారు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **02.11.2022** నాటికి బ్యాంకుకు బాకీయున్న మొత్తాలు **రూ.11,30,19,845.75 పై.లు (రూపాయలు పదకొండు కోట్ల ముప్పై లక్షల పందొమ్మిది వేల ఎనిమిది వందల నలభై ఐదు మరియు డెబ్బై ఐదు పైసలు మాత్రమే)**లను & పూర్తిగా చెల్లించువరకు దానిపై తదుపరి వడ్డీ తో **పంజాబ్ నేషనల్ బ్యాంక్ కు** చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరాలు:

1) శ్రీమతి వేమూరి ప్రమీళ పేరున ఉన్న రాయనపాడు గ్రామం& పంచాయతి, ఇబ్రహీంపట్నం సబ్-రిజిస్ట్రార్, విజయవాడ, కృష్ణా రిజిస్ట్రేషన్ జిల్లా, ఆం.ప్ర. వద్దగల సర్వే నం.77/1, ప్లాట్ నం.136లో 209చ.గ.ల విస్తీర్ణపు నివాసిత ఖాళీ ప్లాటు మొత్తం **మరియు సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం.137; **దక్షిణం:** ప్లాట్ నం.135; **తూర్పు:** 33అ.ల వెడల్పు రోడ్డు; **పడమర:** ఓపెన్ సైటు.

2) వేమూరి రాజ శేఖర్ పేరున ఉన్న కృష్ణా జిల్లా, విజయవాడ, గుణదాల, కరెన్సీ నగర్ ఇంటెరియర్, నాగార్జున నగర్ వద్దగల ఆర్.ఎస్.నం.325/3, 325/4, ఎల్.పి.నం.154/79, మున్సిపల్ వార్డు నం.36, డోర్ నం.48-18-2ఎ తో లార్డ్స్ పార్క్ వీవ్ అపార్టుమెంట్స్ పేరున (846.332చ.గ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను) 84.63చ.గ.ల విడదీయలేని స్థలముతో 18.06చ.అ.లు (252చ.అ.ల ఉమ్మడి ఏరియా మరియు 200చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా) ప్లింత్ ఏరియాతో నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నం.502 మొత్తం **మరియు సరిహద్దులు: ఉత్తరం:** ఒపెన్ టు స్కై; **దక్షిణం:** ఉమ్మడి లిఫ్టు, కారిడార్, మెట్లు & ఒపెన్ టు స్కై; **తూర్పు:** బాల్కనీ, ఒపెన్ టు స్కై; **పడమర:** బాల్కనీ, ఒపెన్ టు స్కై.

తేది: 14.12.2022
ప్రదేశం: ఇబ్రహీంపట్నం (విజయవాడ)
సం/- (బి. సోమేశ్వర రావు) అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
ఆంధ్రా కార్పొరేషన్
లబ్బీపేట బ్రాంచి
VNR టవర్స్, వాటర్ ట్యాంక్ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ-520010 ☎ 0866-2475821

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1)}

[illegible]

1) విశాఖపట్నం, జివియమ్‌సి, వార్డు వార్డు నెం.15, సివియమ్ కాంప్లెక్స్, టి.పి.నెం. 62/65, ప్లాట్ నెం.46, టి.యస్.నెం.1036/2, డోర్ నెం.9-1-224/4/10 నందు 1414 చ॥గ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం.15 & 16 స్థలము మరియు అందులో నిర్మించిన "తాజ్-బాలాజీ ఛాంబర్స్" (నైబర్ హుడ్ కాంప్లెక్స్), 2వ అంతస్తులో **శ్రీ లింగం శరత్ చంద్రబాబు అలియాస్ శరత్‌బాబు, తండ్రి: శ్రీ యల్.భోగేశ్వరరావుకు చెందిన** 3300 చ॥అ॥ (కామన్ ఏరియాతో కలుపుకొని) ప్లింత్ ఏరియాలోని కమర్షియల్ ఫ్లాట్ నెం.502 మరియు మొత్తం స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 130.00 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలముతో సహా యావత్తు.

2) విశాఖపట్నం, జివియమ్‌సి, వార్డు వార్డు నెం.15, సివియమ్ కాంప్లెక్స్, టి.పి.నెం. 62/65, ప్లాట్ నెం.46, టి.యస్.నెం.1036/2, డోర్ నెం.9-1-224/4/5 నందు 1414 చ॥గ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం.15 & 16 స్థలము మరియు అందులో నిర్మించిన "తాజ్-బాలాజీ ఛాంబర్స్" (నైబర్ హుడ్ కాంప్లెక్స్), 2వ అంతస్తులో **శ్రీ లింగం శరత్ చంద్రబాబు అలియాస్ శరత్‌బాబు, తండ్రి: శ్రీ యల్.భోగేశ్వరరావుకు చెందిన** 3300 చ॥అ॥ (కామన్ ఏరియాతో కలుపుకొని) ప్లింత్ ఏరియాలోని కమర్షియల్ ఫ్లాట్ నెం.301 మరియు మొత్తం స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 118.00 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలముతో సహా యావత్తు.

తేది : 12.12.2022
ప్రదేశము: విజయవాడ
సం/- ఎజియమ్ / ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
ఆంధ్రా కార్పొరేషన్
లబ్బీపేట బ్రాంచి
VNR టవర్స్, వాటర్ ట్యాంక్ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ-520010 ☎ 0866-2475821

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొరకు SARFAESI ACT 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ఇవ్వబడిన నోటీసు తేదీ: 14-12-2022

టు, మెసర్స్ సెవన్ డేస్, యజమాని: శ్రీ వాసిరెడ్డి ఫణికుమార్, 2-151, తాడిగడప సెంటర్, పోరంకి, విజయవాడ-521137. **శ్రీమతి వాసిరెడ్డి నంజూష (మెసర్స్ సెవన్ డేస్ యొక్క హామీదారులు), భర్త: ఫణికుమార్,** R/o.ఫ్లాట్ నెం.501, బ్లాక్-బి, మధురం ల్యాండ్ మార్క్, శ్రీనివాసనగర్, సీతాపురం కాలనీ, పోరంకి, విజయవాడ-520007. **శ్రీ వాసిరెడ్డి ఫణికుమార్ (మెసర్స్ సెవన్ డేస్ యొక్క యజమాని & తనఖాదారు), తండ్రి: లేటు ప్రసాదరావు,** డి.నెం.4-65, రైతుపేట, నందిగామ గ్రామము, కృష్ణా జిల్లా. **మరియు ఇక్కడ కూడా:** R/o.ఫ్లాట్ నెం.501, బ్లాక్-బి, మధురం ల్యాండ్ మార్క్, శ్రీనివాసనగర్, సీతాపురం కాలనీ, పోరంకి, విజయవాడ-520007. **మరియు ఇక్కడ కూడా:** R/o.ఫ్లాట్ నెం.305 (S-5), 2వ అంతస్తు, సాయి సదన్ అపార్ట్‌మెంట్, గౌతమ్ జూనియర్ కాలేజీ దగ్గర, ప్రకాష్ నగర్, నందిగామ (గ్రా) & మండలం.

డియర్ సర్ / మేడమ్,

విషయం : సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు ద్వారా ఋణఖాతాను నిరర్థక ఆస్తులుగా ప్రకటించబడిన ఋణ సదుపాయములకు సంబంధించి

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా **మా బ్రాంచి** వద్దనున్న మీ SOD, UGECL **లోన్ ఖాతాకు సంబంధించి** మీరు బకాయిలను / వాయిదాలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున **29.08.2022 తేదీన నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది. 31.07.2022 తేదీనాటికి** సదరు బకాయి మొత్తము **రూ.80,57,121.07 (అక్షరాల ఎనభై లక్షల యాభై ఏడు వేల నూట ఇరవై ఒకటి రూపాయలు మరియు ఏడు పైసలు మాత్రమే)** క్రింది తెలుపబడిన స్థిరాస్తితో హామీ ఇవ్వబడినది. ఋణఖాతాలో ఉన్న బకాయి వివరములు క్రింద ఇవ్వబడినవి. మీరు దిగువ వివరించిన రుణాలను **బ్యాంక్** నుంచి తీసుకున్నారని గమనించగలరు. (అమౌంట్ రూ.లలో)

వ.నెం.	అకౌంట్ నెంబరు	పేరు	సదుపాయము	లిమిట్	31.07.2022 తేదీనాటికి బకాయి
1	034331100002032	సెవన్ డేస్	SODGN	35,00,000/-	Rs.35,32,628.70/-
2	034330100091285	సెవన్ డేస్	TLMEN	50,00,000/-	Rs.43,32,392.67/-
3	034330100090806	సెవన్ డేస్	BENEI	1,95,000/-	Rs.1,15,219.70/-
4	034316350000003	సెవన్ డేస్	TL005	78,000/-	Rs.76,880.00/-
TOTAL					Rs.80,57,121.07/-

అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తమును చెల్లించ లేదు / మీ ఋణములను తీర్చలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మొత్తము **రూ.80,57,121.07 (అక్షరాల ఎనభై లక్షల యాభై ఏడు వేల నూట ఇరవై ఒకటి రూపాయలు మరియు ఏడు పైసలు మాత్రమే)** ఋణపత్రములో చెప్పబడిన నియమ నిబంధనలలోనున్న ఒప్పందపు రేటు ప్రకారము **01.08.2022 తేదీనుండి** వడ్డీతో సహా ఈ నోటీసు అందిన **60 రోజులలోగా** చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన అస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేనిలేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

[illegible]

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

నిజం..!

గట్టిగా మాట్లాడితే భయం. గొంతెత్తి పాడితే భయం. కాలికి గజ్జె కడితే భయం. కలం అంటే మరీ భయం. నిర్భీతిగా వార్తలు అందించేవారంటే ఇంకా భయం. ఎవరైనా గొంతెత్తితే... వారి గుండెల్లో దరువులా మారుమ్రోగుతుంది. దానికి ప్రతీకారంగానే ఆంక్షలు, నిర్బంధాలు, నిషేధాలు. జర్నలిస్టుగా తాను రాసే ప్రతి అక్షరం ప్రజల పక్షంగా వున్నప్పుడు, నిజాలను నిగ్గు తేల్చడమే లక్ష్యంగా వున్నప్పుడు ఈ అణచివేతలు, నిర్బంధాలు మరింత పెరుగుతుంటాయి. నిజాలు చెప్పేవారిపై అప్రకటిత నిషేధాలు విధిస్తారు. దాడులకు తెగబడే సంఘపరివార్ శక్తులకు ఊతమిస్తున్నారు. కలమెత్తిన కరాలను... కదిలించే పదాలను... స్వేచ్ఛనీ, స్వేచ్ఛాభివ్యక్తినీ నిరంకుశ పాలకులు సహించలేరన్న నిజం అడుగడుగునా రుజువవుతోంది. 'న్యాయమూర్తి, జర్నలిస్టు- ఈ రెండు వృత్తులు తప్పనిసరిగా స్వతంత్రంగా ఉండాలి. అవి విఫలమైతే, ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది. దేశంలో ప్రజాస్వామ్యం సజావుగా సాగేందుకు జర్నలిస్టుల స్వాతంత్ర్యాన్ని పరిరక్షించాలి' అంటారు జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ.

ప్రపంచ వ్యాప్తంగా కలానికి సంకెళ్లు పడుతూనే వున్నాయి. కార్పొరేట్ల కనుసన్నలలో మెలిగే ప్రభుత్వాలు తమకు అనుకూలంగా లేని మీడియా సంస్థలపైన, తమకు భజన చేయని పాత్రికేయులపైనా కత్తికడుతున్నారు. కాదంటే నిర్బంధం.. ఎదిరిస్తే దారుణ హత్యలు. ప్రపంచ వ్యాప్తంగా 2021లో 488 మందిని అరెస్టు చేయగా, ఈ ఏడాది 533 మంది పాత్రికేయులను అరెస్టు చేశారని ఫ్రాన్స్‌కు చెందిన 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్' తన నివేదికలో వెల్లడించింది. మహిళా జర్నలిస్టులను సైతం వదిలిపెట్టలేదు. 2021లో 60 మంది మహిళా జర్నలిస్టులు జైళ్లపాలైతే, ఈ ఏడాది ఆ సంఖ్య 78కి పెరిగింది. భారత్‌లోనూ ఈ నిర్బంధకాండ అమలు జరుగుతోంది. న్యూస్‌క్లిక్, ది వైర్ వంటి మీడియా సంస్థల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడం, జర్నలిస్టులను అక్రమంగా నిర్బంధించడం, గౌరీ లంకేష్ వంటి జర్నలిస్టుల ప్రాణాలను బలికొనడం వంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి. 2021 ఇండియా ప్రెస్ ఫ్రీడమ్ నివేదిక కూడా ఈ విషయాన్నే స్పష్టం చేసింది. భారతీయ మీడియా స్వేచ్ఛ మేడిపండేనని తేల్చింది. 180 దేశాల పత్రికా స్వేచ్ఛపై ఆరా తీస్తే... అందులో భారత్ 142వ స్థానంలో నిలిచింది. సమాజంలో పెచ్చుమీరుతున్న కలుపు మొక్కల్ని ఏకిపారేసే జర్నలిజాన్నీ, జర్నలిస్టుల్నీ అణచేస్తున్నారు.

'వారు మొదట యూదుల కోసం వచ్చారు/ నేను యూదును కాదు కాబట్టి పట్టించుకోలేదు/ తర్వాత వారు క్రైస్తవుల కోసం వచ్చారు/ నేను క్రైస్తవుడ్ని కాదు కాబట్టి పట్టించుకోలేదు/ తర్వాత వారు కమ్యూనిస్టుల కోసం వచ్చారు/ నేను కమ్యూనిస్టును కాదు కాబట్టి పట్టించుకోలేదు/ తర్వాత వారు నా కోసం వచ్చారు/ నన్ను రక్షించేందుకు ఎవరూ మిగల్లేదు' అంటాడో జర్మనీ కవి. జనాన్ని కులం, మతం గొడవల్లోకి నెట్టి... దేశం యావత్తూ కార్పొరేట్ కంపెనీలకు గుత్తగా అప్పజెప్పేందుకు కంకణం కట్టుకున్నారు పాలకులు. ఈ క్రమంలో ఎత్తిన గొంతును, రాసే కలాన్ని, రగిలే అక్షరాన్ని సమూలంగా నాశనం చేయడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. నికార్సయిన జర్నలిస్టులు నిజం కోసం సాగించే యజ్ఞం ఇది. ఒక్కడిగా వుండాలో... పదుగురితో కదలాలో నిర్ణయించుకునే తరుణం ఇది. భవిష్యత్తరాలకోసం సాగించే పోరాటంలో ప్రజల మెదళ్లను కదలించే కలం కావాలి. వారిని చైతన్యపరిచే అభ్యుదయ కరం కావాలి. ఎన్ని అడ్డంకులెదురైనా అదరం... బెదరం అని, ఎన్ని నిర్బంధాలెదురైనా ఎత్తిన కలం దించేది లేదని ముందుకు సాగాలి.

'పత్రికొక్కటున్న పదివేల సైన్యము/ పత్రికొక్కటున్న మిత్రకోటి/ ప్రజలకు రక్ష లేదు పత్రిక లేనిచో' అంటారు నార్ల. కార్పొరేట్ మీడియాని లొంగదీసుకున్నంత మాత్రాన మొత్తం మీడియా ప్రభుత్వ పెద్దల కాళ్ళకు సాగిలపడదు. ఎంతగా అణచివేస్తే... ధిక్కారం అంతగా పెరుగుతుంది. 'పత్రికలులేని ప్రభుత్వం ఉండాలా? లేక ప్రభుత్వం లేని పత్రికలు కావాలా? అని నన్నడిగితే రెండోదానివైపు మొగ్గు చూపడానికి క్షణం కూడా సంశయించను' అంటాడు అమెరికా మాజీ అధ్యక్షుడు థామస్ జెఫర్సన్. ఏ దేశంలోనైనా ప్రజాస్వామిక విలువలు కొనసాగాలంటే... మొదట పత్రికాస్వేచ్ఛ ఉనికిలో ఉండాలి. దాన్ని గుర్తించడం అవసరం.

మహనీయుల మాట

భయపడడం ఎప్పుడు మానేస్తామో
అప్పుడే మన జీవితం
మొదలైనట్లు

-చెగువేరా

తెలుగు రాష్ట్రాల్లో కొత్త రాజకీయ కోణాలు

విశ్లేషణ



తెలకపల్లి రవి

మోడీ, అమిత్ షా బృందం ఎపిలో తెరవెనక నుంచి, తెలంగాణలో నేరుగా రాజకీయ భాగోతం నడిపిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఎపిలో మళ్లీ వూపిరిపోయడానికి ప్రయత్నిస్తుండడమే గాక తెలంగాణలో కొంత పట్టువున్నా అంతర్గత కలహాలతో రగిలిపోతున్నారు. జనసేన ఎపిలో మాత్రం బిజెపితో కలసి వస్తుందని అంటుంటే తెలంగాణలో పొత్తు వుండదన్నట్టే సూచిస్తున్నారు. అయితే అక్కడ టిడిపి, జనసేన విడిగా పోటీ చేయడం బిజెపికే మేలని కూడా విశ్లేషిస్తున్నారు. ఎపిలో పొత్తులకు తెలంగాణ పోటీ బేరసారాల అస్త్రంగా వుంటుందని భావిస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. వీటివల్ల వెంటనే మౌలికంగా ఏదో జరిగిపోతుందని కాదు గాని రాజకీయ శక్తులు, వ్యక్తులు వ్యవస్థల పాత్ర మారిపోతున్నది. కలయికలు, కలహాలు, విడిపోవడాలు, విలీనాలు ఇవన్నిటి వెనక ఒక అప్రకటిత అవగాహన ఏదో వున్నట్టు తోస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో జరిగే పరిణామాల మధ్య కూడా సంబంధం ఏదో గోచరిస్తుంది. కులవారీ సమీకరణలు, సమావేశాలు వేగం పుంజుకుంటున్నాయి. ఇవి మీడియాలోనూ ప్రతిబింబిస్తున్నాయి. నీరు కన్నా రక్తం చిక్కన అన్నట్టు తెలుగువారు రెండు రాష్ట్రాలయినప్పటికీ రాజకీయ గమనంలో కొన్ని ఉమ్మడి అంశాలు ప్రస్ఫుటమవుతున్నాయి. పాలక పార్టీలకు సంబంధించినంతవరకూ అధికారం తప్ప మిగిలినవన్నీ ద్వితీయ ప్రాధాన్యతే వహిస్తాయి గనక ఏతావాతా ఏదైనా జరగొచ్చనే భావం రానురానూ ప్రజలలో పెరిగిపోతున్నది. కాకుంటే పైకి కనిపించని రాజకీయాంశాలేమిటి, వాటి ప్రభావమేమిటి అన్న ఆసక్తి, ఒక అస్పష్ట వాతావరణం పెంచుతున్నది.

బిఆర్ఎస్ అవతరణ

ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించిన మార్పులలో మొదటిది టిఆర్ఎస్ బిఆర్ఎస్‌గా అవతారమెత్తడం. తెలంగాణ అన్న మాటతో సాగిన పదేళ్ల రాజకీయం, ఆ పేరుతో ఏర్పడిన పార్టీ ఇరవయ్యేళ్ల గమనం ముగిసి జాతీయ పార్టీగా మారింది. బిజెపి నిరంకుశత్వాన్ని, మతతత్వ రాజకీయాలను, రాష్ట్రాలపై దాడులను ఎదుర్కోవడానికి జాతీయపాత్ర పోషిస్తామని కెసిఆర్ అక్టోబరులోనే ప్రకటించారు. లౌకిక పార్టీలు ఆ నిర్ణయాన్ని హర్షించాయి కూడా. ఇదే సమయంలో మునుగోడు ఉపఎన్నిక విజయం దానికి మరింత వూపు నిచ్చింది. ఆ ఎన్నికల నాటికే టిఆర్ఎస్ నేతలు ఢిల్లీ లిక్కర్ స్కాంలో చిక్కుకున్నారనే కథనాలు వెలువడుతూ వచ్చాయి. పోలింగ్‌కు ముందు చివరి వారంలో ఆపరేషన్ ఫాంహౌస్ దుమారం రేపింది. సిబిఐ, ఇడి లిక్కర్ స్కాం పేరిట రంగ ప్రవేశం చేశాయి. ఇందులోనూ రెండు రాష్ట్రాల నేతల పేర్లు వచ్చాయి.అయితే ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం తాము బిఆర్ఎస్ విషయంలో వెనక్కు తగ్గేదిలేదంటూ ముందడుగు వేశారు. ఢిల్లీలో కార్యాలయం కూడా ప్రారంభించి యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, వివిధ రాష్ట్రాల రైతు నాయకులతో చర్చలు జరిపారు. పంజాబ్ కిసాన్ నేతను తమ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడుగా ప్రకటించారు. వచ్చేది రైతు ప్రభుత్వమన్నట్టు ప్రకటిస్తున్నారు. ఈ సమయంలోనే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణా హిందీని గేళి చేస్తూ మాట్లాడ్డం కెసిఆర్ భవిష్యత్ ప్రసంగాలనుద్దేశించిందే. కర్ణాటక ఎన్నికలు మూడు మాసాలలోనే వస్తాయి గనక అక్కడ ఇదివరకటి నిజాం సంస్థానభాగాలలో పోటీ చేస్తారంటున్నారు. కుమారస్వామికి కూడా అన్ని విధాల సహాయం అవసరం గనక , ఈ ప్రాంతాలలో బలం కూడా అంతంతే గనక కెసిఆర్‌ను మరింతగా ఆహ్వానిస్తున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘర్, ఒరిస్సా, తమిళనాడులపైన కూడా ఆ విధమైన ఆశలున్నాయి. ఎపిది మరో ప్రత్యేకత. గత పరిణామాలు, ఉద్యమ కాలపు ఉద్రేకాల రీత్యా బిఆర్ఎస్ ఎపిలో పెద్ద ప్రభావం చూపే అవకాశం వుండదు. కానీ సోదర రాష్ట్రంలో పోటీ చేయకపోతే తమ జాతీయ పార్టీకి అర్థం వుండదని ఆ నాయకులకు తెలుసు. అందుకే వారికి సన్నిహితులైన కొందరు ఫ్లెక్సీలు పెడుతున్నారు. రాజకీయంగా కూడా వైఎస్ఆర్‌సిపి, ముఖ్యమంత్రి జగన్ ప్రధాని మోడీకి బిజెపికి సన్నిహితులుగా పేరొందారు. ఆ మాట కెసిఆర్ ఎప్పుడూ గుర్తు చేస్తుంటారు కూడా. చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం కూడా కెసిఆర్‌కు వ్యతిరేకంగానే నిలబడిన పరిస్థితి గానీ బిజెపికి దగ్గరగా వెళ్లాలని చూస్తున్నారు. ఈ సమయంలో చంద్రబాబు నాయుడు మరోసారి తెలంగాణలో పునర్వైభవం తెస్తానంటూ వచ్చే వారం ఖమ్మంలో సభ పెడుతున్నారు. మోడీ, అమిత్ షా బృందం ఎపిలో తెరవెనక నుంచి, తెలంగాణలో నేరుగా రాజకీయ భాగోతం నడిపిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఎపిలో మళ్లీ వూపిరిపోయడానికి ప్రయత్నిస్తుండడమే గాక తెలంగాణలో కొంత పట్టువున్నా అంతర్గత కలహాలతో రగిలిపోతున్నారు. జనసేన ఎపిలో మాత్రం బిజెపితో కలసి వస్తుందని అంటుంటే తెలంగాణలో పొత్తు వుండదన్నట్టే సూచిస్తున్నారు. అయితే అక్కడ టిడిపి, జనసేన విడిగా పోటీ చేయడం బిజెపికే మేలని కూడా విశ్లేషిస్తున్నారు. ఎపిలో పొత్తులకు తెలంగాణ పోటీ బేరసారాల అస్త్రంగా వుంటుందని భావిస్తున్నారు. వామపక్షాలు తెలంగాణలో రాజకీయంగా బిఆర్ఎస్‌తో కలసి బిజెపిని వ్యతిరేకిస్తున్నా ఎన్నికల నాటికి గాని పొత్తు గురించి చెప్పడానికి లేదని సిపిఎం అంటున్నది. సిపిఐ ఎపిలో టిడిపితో కలసి పాల్గొంటూ వుంటే తెలంగాణలో ప్రతి సందర్భంలోనూ బిఆర్ఎస్‌కు మద్దతులో ముందుంటున్నది. బిజెపిని టిఆర్ఎస్, ఉభయ కమ్యూనిస్టులు కలసి ఎదుర్కొంటున్న తెలంగాణా వాతావరణం, మూడు ప్రాంతీయ పార్టీలూ బిజెపికి అనుకూలంగా వుంటున్న ఎపి రాజకీయాలు భిన్నంగా కనిపిస్తున్నాయి.

విభజన సమస్యలు, వివాదాలు

ఈ పరిస్థితి బిఆర్ఎస్, వైసిపీల మధ్య, ఎపి, తెలంగాణాల మధ్య కూడా వైరుధ్యాలను పెంచుతున్నది. జగన్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కెసిఆర్, ఆయన స్నేహితులుగా వుంటారని భావించేవారు. విభజన సమస్యల పరిష్కారమే గాక కొత్త ప్రతిపాదనలు కూడా అప్పట్లో వినిపించాయి. అదంతా ఆచరణలో అక్కరకు వచ్చింది లేదు. ప్రాజెక్టులపై ఆయన ప్రకటనలు ప్రభుత్వం ఆమోదించలేదు. ప్రతిపక్షాలూ విమర్శించాయి. వ్యక్తిగత సంబంధాలు, పరస్పర ప్రశంసలు వున్నా విభజన సమస్యలపై వివాదాలే పెరిగాయి. మొదట్లో కెసిఆర్ కేంద్రంతో మంచిగా వున్న కాలంలో కూడా పరిష్కారం దిశలో అడుగైనా పడలేదు. ఇక ఇప్పుడు వైరుధ్యాలు మరీ పెరిగాక జరిగిన పలు సమావేశాలు వృథా అయ్యాయి. పరిష్కారానికి తెలంగాణ అడ్డుపడుతున్నదంటూ హఠాత్తుగా జగన్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేసింది. అయితే అందులో కేంద్రం బాధ్యతను కనీసంగా ప్రస్తావించకపోవడం యాదృచ్ఛికం కాదు. మోడీ ప్రభుత్వ నిర్దేశంతోనే సుప్రీంలో కేసు వేశారనే అభిప్రాయం వుంది. దానితోపాటే విభజన చట్టం సక్రమంగా ఆమోదించలేదనే ఆనాటి కేసులు కూడా ముందుకొచ్చాయి. ఆ కేసు వేసిన వారిలో ఒకరైన మాజీ ఎంపి ఉండవల్లి తనను ఎవరూ బలపర్చలేదని ఆరోపిస్తూ ప్రభుత్వ వైఖరినీ తప్పు పట్టారు. దాన్ని అవకాశంగా తీసుకుని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అవకాశమే వుంటే రెండు రాష్ట్రాల పునరేకీకరణ కోరతామనడం, దానిపై తెలంగాణ నేతలు విరుచుకుపడటం టీ కప్పులో తుపానులా తయారైంది. తమాషా ఏమంటే కెసిఆర్, జగన్ కలసి ఈ ప్రహసనం నడిపిస్తున్నారనే కథనాలు మీడియాలో వచ్చాయి గాని కేంద్రం ప్రధాన పాత్ర బాధ్యత మరుగున పడిపోయింది. ఈ కేసును కూడా సుప్రీం విచారణకు స్వీకరించి కేంద్రానికి కూడా నోటీసు ఇవ్వాలని ఆదేశించింది.ఈ తతంగంలో మూడో కోణం థర్డ్ డైమెన్షన్ జగన్ సోదరి షర్మిల పార్టీ పెట్టి నిత్యం కెసిఆర్ కుటుంబంపైన కేంద్రీకరించి దాడి చేయడం, ఆమెకు పోలీసులు అవరోధాలు కలిగించడం, ఇటీవల ఆమెను కారుతో సహా తరలించడం దీనికి పరాకాష్ట. వైఎస్ విజయమ్మ కూడా ఆమెతో వుండటం, ఆంధ్రా నేతలు, సమైక్య వాదులు మళ్లీ కుట్రలు మొదలెట్టారని శాసనమండలి ఛైర్మన్ తో మొదలెట్టి అప్పటి టిఆర్ఎస్ నాయకులందరూ దాడి చేశారు. ఈ నేపథ్యంలో జి20 సమావేశంలో ప్రధాని మోడీ ఆ ఘటన గురించి జగన్‌తో ప్రస్తావించారని, తర్వాత ఆమెకు ఫోన్ చేశారని కథనాలు వచ్చాయి. ఆయన ఫోన్ చేయలేదని బిజెపి కీలకనేతలు ఈ వ్యాసకర్తతో చెప్పారు గాని బహిరంగంగా ఖండించలేదు. షర్మిల ఆ విషయమై మాట్లాడబోనన్నారు. ఈ విధంగా తెలుగునాట ప్రాంతీయ పార్టీలన్నిటితోనూ మోడీ నాయకత్వం దాగుడు మూతలాడుతున్నది. వారి రాష్ట్ర నాయకులు మేము అమరావతికే మద్దతు అంటున్నా కేంద్రం ఒక్కసారి కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో కూడా రాజధాని ప్రస్తావనపై సాంకేతిక సమాధానాలు ఇవ్వడం తప్ప తమ విధానం చెప్పలేదు. అయితే టిడిపి నాయకులు మాత్రం అనవసరంగా ఏదో స్పష్టత ఇచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు.మరోవంక ప్రధాని పర్యటనతో మొదలుపెట్టి వరుసగా విశాఖలోనే జాతీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కేంద్రం విశాఖ ఉక్కును మాత్రం అమ్మి తీరతామంటున్నది. పాలక వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ తమలో తాము ఆరోపణలు చేసుకోవడం తప్ప కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడి తేవడమనే ప్రసక్తి లేకుండా పోయింది. అంతేగాక ఉద్యోగుల జీతభత్యాలు పెన్షన్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు జీవోలు వంటి అంశాలన్నీ ప్రధాన ప్రతిపక్షానికి అప్రధానంగా వున్నాయి. మొత్తంపైన రెండు పార్టీలూ రాజకీయ సర్వేల్లో మేమే గెలుస్తామన్న ప్రకటనలోనే మునిగితేలుతున్నాయి. తమ నాయకులు హుషారుగా వుండాలని హెచ్చరిస్తున్నాయి. లేకుంటే అభ్యర్థులను మారుస్తామని బెదిరిస్తున్నాయి.

బిజెపి చెలగాటం

ముందస్తు ఎన్నికలు వస్తాయనేది రెండు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు మరో ప్రధాన ప్రచారంగా వుంది .రెండు పాలకపార్టీలూ ఆ అవకాశం లేదని గట్టిగా ఖండిస్తున్నా ప్రతిపక్షాలూ, కొన్ని మీడియాలు మాత్రం చెబుతూనే వున్నాయి. తాము ఎపికే పరిమితమనీ, బిఆర్ఎస్ మద్దతు కోరితే అప్పుడు ఆలోచిస్తామని సజ్జల చెప్పారు. అయితే ఆ అవకాశం వుండదనేది స్పష్టమే. కానీ ఎపిలో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభిస్తారనీ, కెసి ఆర్ సభ వుంటుందనీ కూడా కథనాలు వస్తున్నాయి. జాతీయ పార్టీగా మారారు గనక గతంలో వలె ఆంధ్ర తెలంగాణ భాషలో మాట్లాడటం కుదరదనీ, సరిగా వుండదనీ కూడా అభిప్రాయం వుంది. లిక్కర్ స్కాం వంటి వాటిలో వైసీపీ నేతల కుటుంబ సంబంధాలు కొన్ని వినిపిస్తే .. ఆపరేషన్ ఫాంహౌస్‌లో వైసీపీ అసమ్మతి ఎంపి పేరు వచ్చింది.చంద్రబాబు నాయుడు ఐఎస్‌బి 20 వ వార్షికోత్సవ కొనసాగింపు సభలో ప్రత్యేకంగా మాట్లాడుతూ సైబరాబాద్ అభివృద్ధి, విజన్ 2020, దాన్ని రూపొందించిన మెకన్సీ(ఈ స్కూలు వారిదే) మొత్తం 2004 నాటి ఎజెండా ఏకరువు పెట్టారు. అమరావతి ఆలస్యంలో తన పాత్రను దాటవేసి అది హైదరాబాద్‌లా పెరిగి వుండేదనే పాత కథే పునశ్చరణ చేశారు. వీటన్నిటిలోనూ రాజకీయ కోణాలు దాచేస్తే దాగేవి కావు. బిజెపి తన ప్రయోజనాల కోసం రెండు రాష్ట్రాలలో తలోవిధంగా చెలగాటమాడుతున్నది గనక బాహాటంగానూ, లోపాయికారిగానూ కనిపించే ఈ పొలీస్ పొలిటికో లీగల్ అంశాలు ఎలా పరిణమిస్తాయో చూడాల్సిందే.

జనవాక్యం

బాధ్యత నుండి తప్పుకోవడమే !

ఆరునెలల క్రితం వద్దులకు రైల్వే ఛార్జీల్లో రాయితీ ఇస్తామని చెప్పిన రైల్వే మంత్రి.. నిన్న లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు...రాయితీలు ఇప్పట్లో ఇవ్వలేమని చెప్పడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనమే. ఇది తమ బాధ్యతలనుండి తప్పించుకోవడమే అవుతుంది. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు వేలకోట్ల రూపాయల మేర రకరకాల రాయితీలిస్తూ, వద్దులకు ఇవ్వలేం అని చెప్పడం బాధ్యతారాహిత్యం. ప్రజాప్రతినిధులకు, అధికారులకు లక్షల రూపాయలు జీతాలుగా ప్రజాధనం చెల్లిస్తూ, మరలా వారికి అన్ని రకాల ఉచిత రవాణా, టెలిఫోన్, ఇంటి అద్దెలు...ఇలా రకరకాలుగా ఎందుకు ఇస్తున్నట్లు ? వద్దుల రాయితీలివ్వలేని వారు వాటినీ రద్దుచేయండి. ఆ డబ్బుతో వద్ధుల ప్రయాణాలకు రాయితీ ఇవ్వండి.

-నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు

విద్యాబోధన ఎలా?

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో 50677 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి పార్లమెంట్‌కు తెలియజేశారు. ఇంత పెద్దసంఖ్యలో ఖాళీలుంటే విద్యార్థులకు బోధించేదెవరు? ఉపాధ్యాయ పోస్టులు ఖాళీయే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కూడా మగ్యం. ఈ పరిణామాలతో లక్షల సంఖ్యలో పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు రాని పరిస్థితి నెలకొంది.

జి.భారతీ దేవి, ఏలూరు,

కవిత

చరిత్రలో లిఖించాల్సిందే

రగులుతున్న ఆకలి యుద్ధాలలో
ఎండిపోతున్న పేగుల చరిత్రను
లిఖితపూర్వకంగా ఎక్కించాల్సిందే

రంగు రంగుల జెండా కర్రలు
ఎజెండాలను మోస్తూ
ఎద్దేవాల కథల మలుపుల వెనుక
విరుపుల నిజాన్ని విని తీరాల్సిందే
నాటి మాటలు నీటి మూటలై
భరోసాల బరువులు మోస్తున్న
పేద వీపును నిమరాల్సిందే
ఇవన్నీ మూకుమ్మడిగా
చరిత్ర పుటల్లోకి తోచేయాల్సిందే

మారుతున్న వర్గ వర్ణాల వెల్లువలో
కొత్త కొత్త రూపకల్పనల వెనుక
ఎగస్తున్న వివక్షత కోరల్లో
నలిగిపోతున్న వ్యవస్థ అవస్థలన్నీ
ఏకధాటిగా వాక్యాలై నినదించాల్సిందే

ఏనాడూ ఎరుగని
ఏకపక్ష ప్రతిపక్ష యుద్ధాల పరంపరలో
వినూత్న రీతులు
ఆవిష్కృతమౌతున్న కాలం కథ
ఒక పేజీలో రెపరెపలాడాల్సిందే

ప్రతిఘటనల తీరుబడిలో
అప్రకటిత వ్యవహార శైలి పురివిప్పాక
ఎన్నడూ ఎరుగని రాజకీలక విన్యాసం
రాబోవు తరాల పుస్తకాలలో
గుణపాఠాలుగా ఒదిగిపోవాల్సిందే

ఎర్రజెండాల తిరుగుబాటులో
సామాజిక చైతన్యాల కోసం
సుదీర్ఘ పోరుబాట విప్లవాక్షరాలు
మరచిపోని చరిత్ర పేజీలు కావాల్సిందే
మారుతున్న కాల గతులు
కరిగిపోతున్న విలువల వ్యథలు
చరిత్రలో మరో మైలురాయిగా
లిఖించి చదివించాల్సిందే

- నరెద్దుల రాజారెడ్డి
ఫోన్: 9666016636

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కామెంట్

ప్రమాదకరంగా బిజెపి విధానాలు

బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్యపెట్టింది. అయితే ...గత ఎనిమిదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా తన కార్మిక వ్యతిరేక విధానాలతో 1,12,509 పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో 6 కోట్ల మందికి ఉపాధి లేకుండా చేశారు. రైల్వేరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. మేధావులను, ప్రజాతంత్ర వాదులను దేశద్రోహం పేరుతో కేసుపెట్టి అరెస్టు చేసి నెలల తరబడి, సంవత్సరాల తరబడి జైళ్ళలో బందిస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధిలేక వేలాదిమంది ఆకలితో అలమటించిన పరిస్థితులను చూసి చలించిన వామపక్షపార్టీల నాయకులు డివైయఫ్ఐ, ఎస్ఎఫ్ఐ..లాంటి ప్రజాసంఘాల నాయకులు వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం గాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. హిందుత్వ అజెండాను అమలు చేసేందుకు విశ్వవిద్యాలయాలలో విసీలను, న్యాయవ్యవస్థలో జడ్జీలను, అలాగే పలు రాజ్యాంగ పదవులలో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులను నియమిస్తున్నారు. విద్యావ్యవస్థను కాషాయీకరణ చేసే ప్రయత్నంలో భాగంగానే జాతీయ నూతన విద్యావిధానం తీసుకొచ్చారు. మన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పాలక పార్టీ వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు, బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నారు.

- యస్. హుస్సేన్ బాషా
డివైఎఫ్ఐ, కర్నూలు
9966071040

ఇంటి కొళాయిలకు మీటర్లు బిగింపు అన్యాయం

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతులతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించి తమ దాష్టికాన్ని ప్రదర్శిస్తూ రైతుల మెడకు ఉరితాళ్లు బిగించే ప్రయత్నం చేస్తోంది. అమృత్ జల్ పేరుతో మున్సిపల్ సంస్కరణల్లో భాగంగా విజయవాడ మధురానగర్ ప్రాంతంలో ఇంటి కుళాయిలకు మీటర్లు బిగించడం ప్రారంభమైంది. ఇంటి యజమానులకు చెప్పకుండా, వారి అనుమతి లేకుండా ఏకపక్షంగా నీటి మీటర్ల బిగింపు ప్రారంభించారు. దీనిపై వామపక్షాలు, పౌర, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.. మంచినీరు ప్రజల హక్కు, సరఫరా ప్రభుత్వ బాధ్యత అని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. సహజ వనరులపై ప్రభుత్వ పెత్తనం, ఆదాయ వనరుగా పరిగణించటం తగదు. నీటి మీటర్ల వల్ల భారం ఉండదని పాలకులు, అధికారులు చెబుతున్నా, భవిష్యత్తులో ప్రజలపై తీవ్ర భారం పడుతుంది. 24 గంటలు నీటి సరఫరా పేరుతో నీటి మీటర్లు పెట్టడం సరికాదు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో బిందెలు, బకెట్లలో నీళ్ల కొనుక్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే విద్యుత్ మీటర్లు, విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలు మోయలేకపోతున్నారు, వెంటనే నీటి మీటర్ల ఏర్పాటు ఆపాలి. ఇళ్లలో పెట్టిన మీటర్లు తొలగించాలని, లేకపోతే ఆందోళన తప్పదని, మీటర్లు జనమే తొలగిస్తారని చెబుతున్నారు. నీటి మీటర్లు బిగించిన ఇళ్లను నిర్వాసితుల సంక్షేమ సంఘం నాయకులు, వామపక్ష నాయకులు పరిశీలించి మాట్లాడినప్పుడు స్థానికులు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసించారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్నులు పెంచారని, ఏనాడూ లేని విధంగా చెత్త పై పన్ను వేశారని, ఇప్పుడు మంచినీటితో వ్యాపారం చేసి ఖజానా నింపుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించటం దారుణమని మండిపడుతున్నారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు పౌరసదుపాయాలను, స్వచ్ఛమైన మంచినీటి సరఫరాను గాలికొదిలేసి.. పన్నులు వసూలు చేసే సంస్థలుగా ప్రభుత్వాలు తయారు చేస్తున్నాయి. గతంలో నీటి మీటర్లు పెట్టడానికి ప్రయత్నించినప్పుడు వామపక్షాలు, స్థానిక ప్రజలు పోరాడి అడ్డుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నాము. మళ్ళీ ప్రజాభీష్టానికి భిన్నంగా నీటి మీటర్లు బిగించడం ప్రజా వ్యతిరేక చర్య. గడప గడపకు వచ్చే ప్రజా ప్రతినిధులు నీటి మీటర్లపై ప్రజలకు సమాధానం చెప్పాలి.

- డా యం. సురేష్ బాబు,
బి. నాగేంద్ర ప్రసాద్,
రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రాథమిక హక్కుల దిక్సూచి రాజ్యాంగం

- సిజెఐ జస్టిస్ చంద్రచూడ్

ముంబయి : మన రాజ్యాంగం నైతిక విద్యకు సంబంధించిన డాక్యుమెంట్ వంటిదని భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ శనివారం వ్యాఖ్యానించారు. మన సమాజంలో నైతిక ప్రవర్తనను సృష్టించడానికి రూపొందించిన పత్రమని అన్నారు. "మన రాజ్యాంగం ప్రజల కోసం ఉద్దేశించలేదు. ప్రజలు ఎలా వుండాలో చెప్పేందుకు నిర్దేశించివుంది. ప్రాథమిక హక్కులకు రాజ్యాంగమే దిక్సూచి. దైనందిన జీవితానికి మార్గదర్శి." అని ఆయన పేర్కొన్నారు. మాజీ అటార్నీ జనరల్ అశోక్ దేశాయ్ 90వ జయంతి సందర్భంగా ముంబయిలో ఆయన సార్మకోపన్యాసం చేశారు. "మేం అన్యాయాన్ని సరిదిద్దాం. సెక్షన్ 377 అనేది గత శకంలోని నైతికతపై ఆధారపడింది. రాజ్యాంగ నైతికత వ్యక్తుల హక్కులపై కేంద్రీకరిస్తుంది. సమాజంలో ఆదరణ పొందిన నైతిక భావనల నుండి దానిని రక్షిస్తుంది." అని ఆయన పేర్కొన్నారు. "ప్రగతిశీల రాజ్యాంగం విలువలనేవి మనకి ఒక మార్గనిర్దేశక శక్తిగా పనిచేస్తాయి. మన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలు రాజ్యాంగం నుండి దూరంగా మళ్లరాదని అవి చెబుతాయి." అని అన్నారు. తమ వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుకునేందుకు ప్రజలకు న్యాయ స్థానాల్లో నమ్మకముండాలి. చట్టం, నైతికతల మధ్య తేడా అనేది అస్పష్టం. చట్టం, నైతికత అనేవి అనుసంధానమై వుంటాయని న్యాయ నిపుణులు పేర్కొంటారని చంద్రచూడ్ అన్నారు. అసలు నైతికత లేదా ప్రవర్తనా నియమావళి ఇలా వుండాలి అని ఎవరు నిర్ణయిస్తారు? బలహీన వర్గాలపై పెత్తనం చెలాయించగల బలమైన వర్గాల వారు అని అన్నారు.

పురుగు మందుల తగ్గింపు లక్ష్యం అనవసరం !

- కెనడాలోని జీవ వైవిధ్య సదస్సులో భారత్ సూచన

మాంట్రియల్ : వ్యవసాయ రంగంలో పురుగు మందుల తగ్గింపునకు సంబంధించి అంతర్జాతీయంగా లక్ష్యాన్ని నిర్దేశించడం అనవసరమని భారత్ పేర్కొంది. ఇక్కడ జరుగుతున్న ఐక్యరాజ్య సమితి జీవ వైవిధ్య సమావేశంలో భారత పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రసంగించారు. ఏ స్థాయిలో పురుగు మందులు తగ్గించాలనేది ఆయా దేశాలకే వదిలి పెట్టాలని ఆయన సూచించారు. జీవ వైవిధ్య సదస్సు (సిబిడి)లో అత్యంత ఉన్నత స్థాయిలో జరిగిన ఒక సమావేశంలో శుక్రవారం మంత్రి మాట్లాడారు. 'ఇతర వర్ధమాన దేశాల మాదిరిగానే భారత్‌లో కూడా వ్యవసాయ రంగమనేది కోట్లాదిమందికి జీవనోపాధి, వారి జీవితం, సంస్కృతి' అని మంత్రి వ్యాఖ్యానించారు. ఆ వ్యవసాయానికి మద్దతివ్వడాన్ని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకోవద్దని అన్నారు. ప్రస్తుతం, భారతదేశంలో 40శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ రంగంలోనే ఉపాధి పొందుతున్నారని 2019 లో విడుదల చేసిన ప్రపంచ బ్యాంక్ డేటా తెలిపింది. కోట్లాదిమందికి ఉపాధి కల్పించే ఈ రంగంలో సున్నితమైన వర్గాలకు అవసరమైన మద్దతునివ్వడాన్ని సబ్సిడీలుగా పిలవరాదని, వాటిని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకోరాదని ఆయన పేర్కొన్నారు. వాటిని హేతుబద్ధీకరిస్తూనే, సానుకూల పెట్టుబడుల ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని కోరారు. అదే విధంగా పురుగు మందులు ఎంత మొత్తంలో ఉపయోగించాలనే లక్ష్యం కూడా అంతర్జాతీయంగా నిర్దేశించడం అనవసరమని, ఆయా దేశాలే వాటిని నిర్ణయించుకునే అవకాశం ఇవ్వాలని సూచించారు. 2030కల్లా కనీసం మూడింట రెండువంతుల మేరకు పురుగు మందులు తగ్గించాలనేది గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ (జిబిఎఫ్)లో ఏడవ లక్ష్యంగా వుంది.

నిర్భయ నిధులేవీ?

- ఆరేళ్లలో 6,712 కోట్లు కేటాయింపు..రూ.4480 కోట్లు విడుదల
- నిధుల కేటాయింపు, వ్యయం గందరగోళం : రాజకీయ విశ్లేషకులు
- దేశంలో సగటున రోజుకు 87 లైంగికదాడి ఘటనలు
- ఢిల్లీలో ప్రతిరోజూ 5.6 కేసులు..
- నిర్భయ ఘటనకు 10 ఏళ్లు..అయినా పరిస్థితిలో మార్పురాలేదు..

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున డిసెంబర్ 16, 2012న నిర్భయపై జరిగిన నిర్భయ లైంగికదాడి, హత్య ఘటన దేశ ప్రజల్ని వణికించింది. కదులుతున్న బస్సులో లైంగికదాడికి దిగిన దుండగుల దుశ్చర్యపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు రేగాయి. ఈ ఘటన జరిగి 10 ఏళ్లు అయినా ఢిల్లీ సహా అనేక నగరాల్లో మహిళలకు రక్షణ కొరవడింది. శ్రామిక మహిళలు రాత్రివేళ ఇంటికి తిరిగి వెళ్లాలంటే... ఎంతో ఆందోళన చెందుతున్నారు. ఆనాటి ప్రజా ఆగ్రహాన్ని చల్లార్చడానికి యుపిఎ ప్రభుత్వం నిర్భయ చట్టాన్ని తీసుకొచ్చింది. నిర్భయ ఫండ్‌ను ఏర్పాటుచేసింది. మహిళల రక్షణ నిమిత్తం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయనున్నట్టు అప్పట్లో ప్రకటించారు. కేంద్రంలో 2014లో మోడీ సర్కార్ అధికారం చేపట్టాక నిధుల్ని సగానికి తగ్గిం చేసింది. 2018-19లో అత్యంత తక్కువగా కేవలం రూ.500 కోట్లను నిర్భయ ఫండ్‌కు కేంద్రం కేటాయించింది. గత ఎనిమిది ఏళ్లుగా ఈ ఫండ్ లెక్కలంతా గందరగోళంగా తయారయ్యాయి. కేంద్రం విడుదల చేస్తున్న లెక్కలకు, క్షేత్రస్థాయికి పరిస్థితికి పొంతన ఉండటం లేదనే విమర్శలున్నాయి.

కేటాయించిన నిధుల్లో 66 శాతం విడుదల

నిర్భయ ఫండ్ ఏర్పాటైన తర్వాత అప్పట్నుంచీ ఆగస్టు 2022 వరకు కేంద్రం రూ.6712 కోట్లు కేటాయించింది. ఇందులో విడుదలైన నిధులు రూ.4480 కోట్లు. కేటాయించిన నిధుల్లో ఇది కేవలం 66 శాతం మాత్రమే. మిగిలిన రూ.2232 కోట్లు నిధులు ఏమయ్యాయో స్పష్టత లేదు. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా మహిళలపై హింస, లైంగికదాడులు మితిమీరుతున్నాయి. దేశంలో సగటున రోజుకు 87 లైంగికదాడి ఘటనలు జరుగుతున్నాయి. లైంగికదాడి కేసులు ఏటా 13 శాతం పెరుగుతున్నాయని జాతీయ నేర గణాంకాల బ్యూరో పేర్కొన్నది. బాధితుల్లో దళిత సామాజికవర్గానికి చెందినవారు 12 శాతం మంది ఉన్నారు. నిర్భయ ఘటన తర్వాత ఢిల్లీలో ఇంకా పరిస్థితి మెరుగుపడలేదని పోలీసులే చెబుతున్నారు. ప్రతిరోజూ సగటున 5.6 లైంగికదాడి కేసులు పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్నాయి. నిర్భయ చట్టం పకడ్బందీగా ఉన్నా..నిర్భయ కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. నిందితులకు సులభంగా బెయిల్ దక్కుతోంది. విచారణ ఏండ్లుగా సాగటంతో ప్రత్యక్ష సాక్షులు గట్టిగా నిలబడలేకపోతున్నారు. ఇదంతా కూడా నిందితులకు కలిసివస్తోంది.

పాలకుల నిర్లక్ష్యం

నిర్భయ ఘటన తర్వాత మహిళా రక్షణపై పాలకులు పెద్ద పెద్ద వాగ్దానాలు చేశారు. మహిళలపై లైంగికదాడి, హింసను అడ్డుకోవటమే లక్ష్యంగా ఆనాటి యూపీఏ ప్రభుత్వం 'నిర్భయ ఫండ్'ను రూ.1000 కోట్లతో ఏర్పాటుచేసింది. లైంగికదాడి బాధితులకు సాయం, పునరావాసం కోసం ఈ ఫండ్స్‌ను రాష్ట్రాలు వినియోగించుకోవాలి. లక్ష్యం, ఉద్దేశాలు మంచివే అయినా కేంద్రంలో పాలకులు 'నిర్భయ ఘటన'ను నిర్లక్ష్యం చేశారు. దాంతో వివిధ నగరాల్లో మహిళా రక్షణ మెరుగుపడలేదు. ఫండ్స్ విడుదలపై లోక్‌సభలో ఆమధ్య కేంద్రమంత్రి స్మృ తి ఇరానీ మాట్లాడారు. ఆరేండ్లలో కేంద్రం నుంచి 36 రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులు విడుదలయ్యాయి. తమకు విడులైన నిధుల్లో 60శాతం కూడా ఖర్చు చేయని రాష్ట్రాలు 17 ఉన్నాయి. కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు విడుదల కావటం ఒక పెద్ద ప్రహసనంగా ఉందని, నిధుల కేటాయింపునకు, విడుదలకు పొంతనలేకపోవటంపై ఫిర్యాదులు వస్తున్నాయి.

చట్టం అమలు పకడ్బందీగా ఉండటంతోపాటు, సామాజిక దృక్పథాన్ని మార్చుకోవాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు. "సమాజం ఆలోచన మారనంత వరకు మహిళలకు సమాన హోదా, భద్రత లభించదు. సమాజంలో సగభాగమైన మహిళలకు సురక్షితమైన స్థలాన్ని సృష్టించడం అందరి బాధ్యత" అని మహిళా హక్కుల కార్యకర్తలు నినదిస్తున్నారు. లింగ సమస్యలపై సున్నితంగా ఉండాలని, పాఠశాలల్లో కార్యక్రమాలు ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అసంపూర్తిగా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం

- చర్చకు రాని సగం అంశాలు
- ఆన్‌లైన్ గేమింగ్‌పై తేలని టాక్స్

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 6 నెలల తర్వాత తొలి సారి జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. శనివారం జరిగిన 48వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం ఎజెండాలో 15 అంశాలు ఉండగా.. కేవలం 8 అంశాలపైనే చర్చించారు. వర్చ్యువల్‌గా జరిగిన ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు. ఏ వస్తువులపై కూడా కొత్తగా పన్నులు వేయలేదు. సమావేశం వివరాలను నిర్మలా సీతారామన్ మీడియాకు వెల్లడించారు. సమావేశాన్ని మధ్యాహ్నం 1.30 గంటలకే ముగించినట్లు మంత్రి తెలిపారు. "పప్పుల పొట్టుపై ఇప్పటి వరకు వేస్తున్న 5 శాతం పన్ను రేటును తగ్గించారు. సమయం చాలకపోవడం వల్ల అప్పలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటును చర్చించలేదు. అదే విధంగా పాన్ మసాలా, గుట్కా వ్యాపారంలో పన్ను ఎగవేతను అడ్డుకొనే యంత్రాంగానికి సంబంధించిన అంశాలు చర్చకు రాలేదు. ఈ సమావేశంలో కొత్త పన్నులపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు." అని మంత్రి సీతారామన్ తెలిపారు. "ఆన్‌లైన్ గేమింగ్‌లపై 28 శాతం పన్ను వేయాలనే ప్రతిపాదనలపై సమయం లేకపోవడంతో చర్చించలేదు. అదే విధంగా క్యాసినో, రేస్ కోర్స్, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి మేఘాలయ సిఎం కన్రాడ్ సంగ్మా నేతత్వంలో ఏర్పాటైన మంత్రుల బందం సమర్పించిన సిఫార్సులు ఈ భేటీలో చర్చించలేదు. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) చెల్లింపుల్లో కొన్ని నేరాలను తగ్గిస్తు నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా విచారణ ప్రారంభించేందుకు కావాల్సిన కనీస పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.1 కోటి నుంచి రూ.2 కోట్లకు పెంచారు." అని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

ఆరోగ్యం, అటవీ, ప్రజా సౌకర్యాలపై జిఎస్‌టి మినహాయించాలి : బుగ్గన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగంలోని 11, 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా పారిశుధ్యం, ఆరోగ్యం, అటవీ, ప్రజాసౌకర్యాలను అమలు చేసే సౌకర్యాలపై జిఎస్‌టిని మినహాయించాలని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 48వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పాల్గొన్నారు. ఇన్‌పుట్ ట్యాక్స్ ప్రభావంలేకపోవడంతో మ్యాన్‌పవర్ సేవలను అందించడం కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ఎపిసిఓఎస్ ద్వారా ప్రభుత్వానికి , ప్రభుత్వ సంస్థల కోసం ఏర్పాటు చేసిన మానవ వనరులను మినహాయింపు జాబితాలో చేర్చాలని బుగ్గన విజ్ఞప్తి చేశారు. జిఎస్‌టి ఆర్ 2 యొక్క తప్పని షరతు లేకపోవడం, భీమా కంపెనీల ద్వారా నాన్ క్లెయిమ్ బోనస్ మినహాయింపుల ప్రకారం డీలర్ల సౌలభ్యం కోసం చేపట్టిన సవరణలు 2017-18, 18-19-20లో కొంతభాగానికి సంబంధించిన సిఎ ధృవీకరణ ఆధారంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పరిగణలోకి తీసుకోవడానికి చేపట్టిన కేంద్రప్రతిపాదనలకు మంత్రి బుగ్గన మద్దతు తెలిపారు.

ఫెలోషిప్‌ను పునరుద్ధరించాలి

- కేంద్రం తీరుపై విద్యార్థుల ఆగ్రహం
- మౌలానా ఆజాద్ ఫెలోషిప్ నిలుపుదలపై విద్యార్థిలోకం

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు తీరు పేద విద్యార్థులకు శాపంగా మారుతున్నది. స్కాలర్‌షిప్‌లకు బ్రేక్ వేస్తూ వారిని చదువు దూరం చేస్తున్నది. భారత దేశ మొదటి విద్యాశాఖ మంత్రి పేరు మీద ఉన్న ఫెలోషిప్‌ను ఈ విధంగానే ముగించింది మోడీ సర్కారు. దీనిపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసనను తెలిపారు. విద్యార్థుల నిరసనలకు విద్యావేత్తలు, నిపుణులు, రాజకీయ పార్టీల నాయకులూ మద్దతు పలికారు.

ముఖ్యంగా పేద, మధ్య, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు మోడీ సర్కారు తీరుతో తీవ్రంగా నష్టపోతున్నారని విశ్లేషకులు, నిపుణులు చెప్పారు. ఆస్ మొహమ్మద్ (25) తండ్రి ఢిల్లీలో బస్ డ్రైవర్‌గా పని చేశాడు. కోవిడ్-19 సమయంలో డ్రైవర్‌గా ఉద్యోగాన్ని ఆయన తండ్రి కోల్పోయాడు. దీంతో మొహమ్మద్‌పై ఆర్థికంగా తీవ్ర భారం పడింది. అయితే, తాను 2019లో సాహిత్యంలో మాస్టర్స్ డిగ్రీని పొందాననీ, పాఠశాల, కళాశాల ద్వారా పొందిన ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లతోనే ఇది సాధ్యమైందని చెప్పాడు. తాను మరింత ముందుకు వెళ్లగలననీ, కళాశాల ప్రొఫెసర్ కావాలనే తన కలను కొనసాగించగలనని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ప్రస్తుతం ఈయన జాతీయ అర్హత పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం యువ పండితులను ఎంపిక చేయటానికి ఏటా దీనిని నిర్వహిస్తారు. పరీక్షకు హాజరైన లక్షలాది మందిలో ప్రతి ఏడాది 25 వేల మంది మాత్రమే ఫెలోషిప్‌ను పొందుతున్నారని ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి.

దేశంలోని ముస్లింలు, ఇతర వర్గాల మధ్య విద్యాపరమైన అంతరాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు చేసిన తర్వాత 2009లో మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ ప్రారంభించబడింది. 2019లో నిర్వహించిన ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రకారం.. దేశ జనాభాలో ముస్లింలు 14.2 శాతం మంది ఉన్నారు. అయితే, దేశంలోని కళాశాలలు, విశ్వ విద్యాలయాలలో చేరిన వారిలో కేవలం 5.5 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్.. భారతదేశం మొదటి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ పేరు మీద పెట్టారు. 2018-19 ప్రభుత్వ సమాచారం ప్రకారం ప్రతి 1000 మందిలో 733 ముస్లిములే ఉన్నారు. మతపరమైన రాజకీయాలకు అలవాటు పడిన కేంద్రంలోని బీజేపీ సర్కారు.. ఈ ఫెలోషిప్‌ను రద్దు చేయడానికి ఇదే కారణమై ఉండొచ్చని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఫెలోషిప్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. ఫెలోషిప్‌ను పునరుద్ధరించాలంటూ విద్యార్థులు తీవ్రంగా పోరాడుతున్నారు. ఈ మేరకు ఈనెల 12న ఢిల్లీలోని విద్యా మంత్రిత్వ శాఖ కార్యాలయం బయట పలు విద్యార్థి సంఘాలకు చెందిన అనేక మంది నాయకులు ప్రదర్శన సైతం నిర్వహించారు. భారీగా పోలీసు బలగాలను మోహరించి విద్యార్థుల నిరసనలను ప్రభుత్వం అడ్డుకున్నది. ఫెలోషిప్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇటు కేంద్రం తీరును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి.

నర్సుల సమ్మెకు మద్దతుగా ఆందోళన చేస్తున్న ప్రజలు

ఉద్యోగుల సమ్మెతో వెలవెలబోతున్న లండన్ రైల్వే స్టేషన్

సమ్మెలతో అట్టుడుకుతున్న బ్రిటన్

- పండుగ వేళ కరువవుతున్న ఉత్సాహం

లండన్ : వరుస సమ్మెలతో బ్రిటన్ అట్టుడికిపోతోంది. పలు రంగాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు జరుపుతున్న వరుస సమ్మెలు, ఆందోళనలతో క్రిస్మస్ సీజను వేళ పండగ ఉత్సాహం కరువవుతోంది. ప్రధాన రైల్వే యూనియన్ ఆర్ఎంటికి చెందిన 40 వేల మందికి పైగా సభ్యులు ఇప్పటికే సమ్మెలో వున్నారు. తాజాగా శుక్ర, శనివారాల్లో కూడా వీరి సమ్మె కొనసాగింది. పోస్టల్, నర్సులు, రవాణా కార్మికులు, అంబులెన్సు డ్రైవర్లు ఇలా అనేక రంగాలకు చెందిన వారు సమ్మెకు దిగడంతో మొత్తంగా దేశవ్యాప్తంగా జన జీవనం స్తంభిస్తోంది. శ్రమ జీవులకు మద్దతుగా సాధారణ ప్రజానీకం కూడా నిరసనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. రైల్వే సిబ్బంది, నర్సుల సమస్యలను తక్షణమే పరిష్కరించి వారు డిమాండ్‌కు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతున్న వేళ తమకు వేతనాలు పెంచాలన్నది రైల్వే, వైద్య, తదితర రంగాల ఉద్యోగులు, కార్మికులు, ఇతర సహాయక సిబ్బంది ప్రధాన డిమాండ్‌గా వుంది. మరో మూడు వారాల పాటు అంటే వచ్చే ఏడాది జనవరి 8 వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని బ్రిటన్ నేషనల్ రైల్వే ఇప్పటికే ప్రకటించింది. క్రిస్మస్ పండుగ.. మూడు రోజులూ సమ్మె జరపాలని రైల్వే యూనియన్ నిర్ణయించింది. రవాణారంగంలో తీవ్ర అంతరాయాలు వుంటాయని తెలిపింది. 20 శాతం సర్వీసులు కూడా తిరగకపోవచ్చని పేర్కొంది. ఈ నెల 23, 24 తేదీల్లో క్రిస్మస్ డెలివరీలు ఎక్కువగా వుండే రద్దీ వేళల్లో తాము సమ్మె జరపనున్నట్లు కమ్యూనికేషన్ వర్కర్స్ యూనియన్ (సిడబ్ల్యుయు) ప్రకటించింది. డిసెంబరు చివరి రోజుల్లో సివిల్ సర్వీస్ ఇండిస్ట్రియల్ యాక్షన్ వుంటుందని పబ్లిక్, కమర్షియల్ సర్వీస్ (పిసిఎస్) యూనియన్ ప్రకటించింది. పండుగ వేళ బ్రిటన్‌లోకి ప్రవేశించాలనుకునే వారికి ఈ ప్రతిపాదిత సమ్మెతో ఇబ్బందులు తప్పవు. సరిహద్దుల వద్ద వేచి వుండక తప్పదు. కాగా, ఇప్పటికే లక్ష మందికి పైగా నర్సులు సమ్మె బాట పట్టారు. బ్రిటన్ గతంలో ఎన్నడూ చూడని రీతిలో పారిశ్రామిక నిరసన కార్యాచరణ వ్యక్తమవుతోంది. కరోనా సమయంలో రాత్రి పగలు అని చూడకుండా శ్రమపడిన తమకు ఆనాడు నైతిక స్థైర్యం పెరిగిందని, కానీ ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి తమకు చాలా అవమానకరంగా వుందని నర్సులు పేర్కొంటున్నారు. సమ్మెలను మించిన పర్యవసానాలు కూడా వుంటాయని ప్రభుత్వం గుర్తించాలని వారంటున్నారు.

శరత్ చంద్రారెడ్డికి రిమాండ్ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితుడుగా ఉన్న శరత్ చంద్రారెడ్డికి జ్యూడిషియల్ రిమాండ్ మరోసారి పొడిగించారు. ఈ మేరకు శనివారం రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఆదేశాలు ఇచ్చింది. శరత్ చంద్రారెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ అనంతరం జడ్జి ఎంకె నాగపాల్ తదుపరి విచారణను జనవరి 7కి వాయిదా వేశారు. శరత్ చంద్రారెడ్డి తరపు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, సిద్ధార్థ లూత్రలు వాదనలు వినిపిస్తూ శరత్ చంద్రారెడ్డిపై పిఎంఎల్ఎ సెక్షన్ల కింద కేసు నమోదు చేయలేదని, కాబట్టి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఈడి తరపు న్యాయవాదులు కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, శరత్ చంద్రారెడ్డి పాత్రపై వచ్చిన ఆధారాలపై విశ్లేషణ జరుగుతున్నట్లు కోర్టుకు తెలిపారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘంగా కొనసాగిన వాదనల అనంతరం కేసు తదుపరి విచారణను సిబిఐ ప్రత్యేక కోర్టు జనవరి 7 నాటికి వాయిదా వేసింది. అప్పటి వరకు నిందితులకు జ్యూడిషియల్ రిమాండ్ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
ఆంధ్రా | కార్పొరేషన్

లబ్బీపేట బ్రాంచి
VNR టవర్స్, వాటర్ ట్యాంక్ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ-520010 ☎ 0866-2475821

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొరకు SARFAESI ACT 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ఇవ్వబడిన నోటీసు తేదీ: 14-12-2022

టు, మెసర్స్ మనస్వి ప్రసాద్ ఫుడ్స్, యజమాని: వాసిరెడ్డి నంజూష, 5వ అంతస్తు, 39-1-57, పివిపి స్క్వేర్, లబ్బీపేట, యమ్‌జిరోడ్డు, విజయవాడ. **శ్రీమతి వాసిరెడ్డి నంజూష (యజమానురాలు), భర్త: ఫణికుమార్,** R/o.ఫ్లాట్ నెం.501, బ్లాక్-బి, మధురం ల్యాండ్ మార్క్, శ్రీనివాసనగర్, సీతాపురం కాలనీ, పోరంకి, విజయవాడ-520007. **శ్రీ వాసిరెడ్డి ఫణికుమార్ (మెసర్స్ మనస్వి ప్రసాద్ ఫుడ్స్ కొరకు తనఖాదారు & హామీదారు), తండ్రి: లేటు ప్రసాదరావు,** డి.నెం.4-65, రైతుపేట, నందిగామ గ్రామము, కృష్ణా జిల్లా. **మరియు ఇక్కడ కూడా:** R/o.ఫ్లాట్ నెం.501, బ్లాక్-బి, మధురం ల్యాండ్ మార్క్, శ్రీనివాసనగర్, సీతాపురం కాలనీ, పోరంకి, విజయవాడ-520007. **మరియు ఇక్కడ కూడా:** R/o.ఫ్లాట్ నెం.305 (S-5), 2వ అంతస్తు, సాయి సదన్ అపార్ట్‌మెంట్, గౌతమ్ జూనియర్ కాలేజీ దగ్గర, ప్రకాష్ నగర్, నందిగామ (గ్రా) & మండలం.

డియర్ సర్ / మేడమ్,

విషయం : సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు ద్వారా ఋణఖాతాను నిరర్థక ఆస్తుగా ప్రకటించబడిన ఋణ సదుపాయములకు సంబంధించి

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా **మా బ్రాంచి** వద్దనున్న మీ SOD, UGECL **లోన్ ఖాతాకు సంబంధించి** మీరు బకాయిలను / వాయిదాలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున **29.08.2022 తేదీన నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది. 31.07.2022 తేదీనాటికి** సదరు బకాయి మొత్తము **రూ.46,12,561.57 (అక్షరాల నలభై ఆరు లక్షల పన్నెండు వేల ఐదు వందల అరవై ఒకటి రూపాయలు మరియు యాభై ఏడు పైసలు మాత్రమే)** క్రింది తెలుపబడిన స్థిరాస్తితో హామీ ఇవ్వబడినది. ఋణఖాతాలో ఉన్న బకాయి వివరములు క్రింద ఇవ్వబడినవి. మీరు దిగువ వివరించిన రుణాలను **బ్యాంక్** నుంచి తీసుకున్నారని గమనించగలరు.

(అమౌంట్ రూ.లలో)

వ.నెం.	అకౌంట్ నెంబరు	పేరు	సదుపాయము	లిమిట్	31.07.2022 తేదీనాటికి బకాయి
1	034316350000004	మనస్వి ప్రసాద్ ఫుడ్స్	TL005	1,18,000/-	Rs.1,16,269.85/-
2	034330100092187	మనస్వి ప్రసాద్ ఫుడ్స్	TLMEN	50,00,000/-	Rs.44,96,291.72/-
TOTAL					Rs.46,12,561.57/-

అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తమును చెల్లించ లేదు / మీ ఋణములను తీర్చలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయిమొత్తము **రూ.46,12,561.57 (అక్షరాల నలభై ఆరు లక్షల పన్నెండు వేల ఐదు వందల అరవై ఒకటి రూపాయలు మరియు యాభై ఏడు పైసలు మాత్రమే)** ఋణపత్రములో చెప్పబడిన నియమ నిబంధనలలోనున్న ఒప్పందపు రేటు ప్రకారము **01.08.2022 తేదీనుండి** వడ్డీతో సహా ఈ నోటీసు అందిన **60 రోజులలోగా** చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేనిలేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సెక్యూరిటీ

ఆస్తి యొక్క వివరణ

వ.నెం.1: కృష్ణా జిల్లా, నూజివీడు టౌన్ మరియు మండలం, నూజివీడు బస్టాండ్ ఎదురు రోడ్డు, వికాస్ టౌన్‌షిప్ దగ్గర, ఆర్‌యస్ నెం.546/4 నందు **శ్రీ వాసిరెడ్డి ఫణికుమార్‌కు చెందిన** 4936.8 చ॥గ॥ లేదా య॥ 1.02 సెం॥ (ఇంటర్నల్ రోడ్లతో) విస్తీర్ణము గల అర్బన్ రెసిడెన్షియల్ ప్లాట్‌కు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: తూర్పు :** రోడ్డు; **దక్షిణం:** నల్లిబోయిన రాఘవరావు యొక్క స్థలము; **పడమర :** గుత్తికొండ నలిని కుమార్ యొక్క స్థలము; **ఉత్తరం :** గుత్తికొండ నలిని కుమార్ యొక్క స్థలము.

వ.నెం.2: కృష్ణా జిల్లా, నందిగామ, ప్రకాష్‌నగర్, రైతుపేట, గౌతమ్ స్కూల్ దగ్గర, ఆర్‌యస్ నెం.614/1, డి.నెం.4-156 నందు 1125.3 చ॥గ॥ విస్తీర్ణములో అవిభాజ్యపు మరియు అనిర్థిష్టపు భాగమైన 28.00 చ॥గ॥ల స్థలము మరియు మొత్తం స్థలములో నిర్మించిన సాయిసదన్ అపార్ట్‌మెంట్స్, 2వ అంతస్తులో **శ్రీ వాసిరెడ్డి ఫణికుమార్ పేరునగల** 945.50 చ॥అ॥ ప్లింత్ ఏరియాలోని ఫ్లాట్ నెం.305 మరియు 140.00 చ॥అ॥ కామన్ ఏరియా, 60.00 చ॥అ॥ కార్ పార్కింగ్ ఏరియాతో సహా యావత్తు.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకువారు సదరు చట్టం ప్రకారం లభించిన అన్ని హక్కులను అన్నింటిని ఉపయోగించిననూ హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయముతోబకాయిలు పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయిసొమ్ము మీ నుండి రాబట్టు కొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్‌వారి సమక్షములో తగు న్యాయ పరమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది.
2) సదరు చట్టం యొక్క 13(2) ప్రకారము, ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతిలేకుండా విక్రయించరాదు మరియు లావాదేవీలు జరుపరాదు. సదరు చట్టం యొక్క ఏ విధమైన అతి క్రమణలు జరిపినా తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గ్రహించవలెను.
3) సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలు కోరడమైనది.

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN : U65923KL2010PLC039179
యూనిట్ నెం.301-315, 3వ అంతస్తు, ఎ వింగ్, కనాకియా వాల్ స్ట్రీట్ అంధేరీ కుర్లా రోడ్, అంధేరీ ఈస్ట్, ముంబయి-400093
Contact No. : 022-68194000/022-66211000.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("యంఎహెచ్ఒఎఫ్ఐయన్") ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు., సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతలను మరియు సహ-రుణగ్రహీతలను పిలుస్తు నోటీసులో పేర్కొన్న మొత్తం సదరు నోటీసు తేదీ నుండి 60 రోజుల్లోగా మొత్తాన్ని చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసు జారీచేయబడింది. రుణగ్రహీత మొత్తాన్ని చెల్లంచుటలో విఫలమైనందున, సదరు రూల్స్ లోని రూల్ 9తో చదవబడే సదరు చట్టం లోని సెక్షన్ 13 (4) క్రింద అతను/ఆమెకి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారుడు ఇందులో దిగువ వివరించిన ఆస్తిని లాంచన ప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని జరిపే ఏవేని లావాదేవీలు మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లోబడి ఉంటాయని తెలియపరుచుచున్నాము.

క్ర.సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారుడు పేరు/లోను ఖాతా నంబర్/శాఖ	సృష్టింబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	డిమాండ్ నోటీసు పంపిన తేది & మొత్తం బకాయిలు	స్వాధీనతా తేదీ
1	అడప వెంకట సుబ్బారావు, అడప సత్యవతి, అడప దుర్గా, అడప రవికుమార్/ MO90LALONS000005005338/ విజయవాడ.	టి.ఎస్.నం.745, బ్లాక్ నం.20, డో.నం.25-2-44/ఎ, పాత మున్సిపల్ వార్డు నం.17, పాత పన్ను నం.35557/ఎ, మూల్యాంకనం నం.25489, అడపావారి వీధి, అగ్రహారం, గుంటూరు, పి.ఓ. ఎటి అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, పిన్: 522004.	14-07-2022 & Rs.296580/-	13-12-2022

తేది: 18.12.2022
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

సం/- ఆధీకృత అధికారి,
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank

నమోదిత కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర.సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	అశ్వధాతి వీరబ్రహ్మ వరప్రసాద్/మహాలక్ష్మి అశ్వధాతి/మెస్సర్స్ హారికా చికెన్ సెంటర్/ LBVJW00005165001/ LBVJW00005165060	షెడ్యూలు ఎ: కృష్ణా జిల్లా విజయవాడ తూర్పు (గుణదల) రిజిస్ట్రేషన్ ఆఫీస్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా సర్వే నెం.462/3, 4ఎ లో 425 చ.గజాల విస్తీర్ణం కలిగిన స్థలం. హద్దులు: తూర్పు. నెల్లూరు వెంకటరమణమ్మ విక్రయించిన ఆస్థి 45.00 చ.గజాలు, దక్షిణం. నెల్లూరు వెంకటరమణమ్మ విక్రయించిన ఆస్థి 85.00 చ.గజాలు, పశ్చిమం. 33.00 అడుగుల రోడ్డు 45 చ.గజాలు, ఉత్తరం. వీరమాచినేని కృష్ణబాబుకు చెందిన ఆస్థి 85.00చ.గజాలు. షెడ్యూలు బి: డోర్ నెం.54-20/2-9ఎ మరియు వార్డు నెం. 31, అసెస్మెంట్ నెం.41232హెచ్/1ఎ, కొత్త అసెస్మెంట్ నెం.615954తో వున్న పెరల్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో 2వ ఫ్లోర్. హద్దులు: తూర్పు. ఓపెన్ టు స్కై, దక్షిణం. ఓపెన్ టు స్కై, పశ్చిమం. ఓపెన్ టు స్కై, ఉత్తరం. ఓపెన్ టు స్కై. లాంఛనపూర్వక స్వాధీనతా తేదీ: 14-12-2022.	06.09.2022 Rs. 1,29,95,828.00/-	విజయవాడ
2.	కొప్పల్లి ఎన్‌డిఎస్ఆర్ఎస్‌వీఆర్ తేజ/ కొప్పోలు రుష్యేంద్రమణి/ LBVJW00005264835	ఎ షెడ్యూల్ ప్రోపర్టీ: గుంటూరు జిల్లా గుంటూరు రిజిస్ట్రీ, పెదకాకాని సబ్ రిజిస్ట్రీ, మంగళగిరి మండలం, కాజ గ్రామంలో సెరినిటీ-2 పేరిట వున్నప్రాజెక్టులో మొత్తం 605.38 చ.గజాల విస్తీర్ణంలో అవిభక్త, అనిర్దేశిత ఉమ్మడి భూమి 67.017 చ.గజాలు లేదా 56.03 చ.మీటర్ల విస్తీర్ణం కలిగిన మొత్తం ఆస్థి, అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో కలిపి. హద్దులు: తూర్పు. గుత్తికొండ అప్పిరెడ్డికి చెందిన ఆస్థి, దక్షిణం. 30 అడుగుల వెడల్పున్న ఉమ్మడి బజారు, ఉత్తరం. ప్లాట్ నెం.7లో మాదా సత్యనారాయణ, ఇతరులకు చెందిన ఆస్థి, పశ్చిమం. ఆచటం భానుకిరణ్‌కు చెందిన ఆస్థి. బి షెడ్యూలు ప్రోపర్టీ: స్టిల్ట్+గ్రౌండ్+4 అప్పర్ ఫ్లోర్లతో సెరినిటీ 1 పేరిట నిర్మితమవుతున్న సెమీ ఫినిష్డ్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో 3వ ఫ్లోర్‌లో 1220.22 చ.అడుగుల విస్తీర్ణం కలిగిన స్థలంలో వున్న తూర్పు ఫేసింగ్ ఫ్లాట్ నెం.401, 343.84చఅడుగుల కామన్ ఏరియా, 134.48చ.అడుగుల పార్కింగ్ ఏరియా (ఒక కార్ పార్కింగ్, డ్రైవ్ వే)తో పాటు లిఫ్ట్, జనరేటర్ వినియోగం వంటి అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో కలిపి. హద్దులు: తూర్పు. లిఫ్ట్, కామన్ కారిడార్, మెట్లు, దక్షిణం. ఓపెన్ టు స్కై, ఉత్తరం. ఓపెన్ టు స్కై, పశ్చమం. ఓపెన్ టు స్కై. అనుబంధ 1ఎఎ షెడ్యూలు 1: ప్రోపర్టీ వున్నది కాజ గ్రామంలో 2. సమీప డోర్ నెం.250, 3. డోర్ నెం.లు 380 తదుపరి విభజన తరువాత 380/2బి2, 380/2 విభజన తరువాత 380/2బి2, 4. మొత్తం ఏరియా విస్తీర్ణం: అవిభక్త, అనిర్దేశిత 67.017 చ.గజాల ఉమ్మడి ఆస్తి. బిషెడ్యూలు: మొత్తం 605.38 చ.గజాల విస్తీర్ణంలో 3వ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం.401. 1. రూఫ్ స్వభావం. ఆర్‌సిసి, 2. నిర్మాణ స్వభావం. పిల్లర్స్, 3. ఫ్లాట్ యొక్క విస్తీర్ణం 1220.22 చ.అడుగులు. 4. కామన్ ఏరియా. 343.84 చ.అడుగులు, 5. పార్కింగ్ ఏరియా 134.48 చ.అడుగులు. లాంఛనపూర్వక స్వాధీనతా తేదీ: 12-12-2022.	20.09.2022 Rs. 39,99,346.00/-	విజయవాడ

ఈ నోటీసు అందిన 30 రోజుల్లోగా బకాయి మొత్తమును చెల్లించవలసిందిగా రుణగ్రహీత/హామీదారులకు సూచించటమైనది. లేకుంటే ఈ నోటీసు ప్రచురితమైన నాటి నుండి 30 రోజుల గడువు ముగిసిన తరువాత పైన పేర్కొన్న సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్‌లోని రూల్ 8, 9 నిబంధనల మేరకు తనఖా పెట్టిన ఆస్తులు విక్రయించబడతాయి.

తేదీ: డిసెంబర్ 17, 2022
స్థలం: విజయవాడ, గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

మీకోసం

వన్నె తగ్గిన బంగారం, వెండి ఆభరణాలను విరిగిన పాలతో కడిగితే కొత్తవాటిలా మెరుస్తాయి.

జీవన సారథం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం ప్రతి మనిషికీ అవసరం.

చీమ మేలు

గోదావరి నది తీరాన ఒక చెట్టు, చీమ నివసించేవి. అవి మంచి స్నేహితులు. చెట్టుకు దాహం వేస్తే చీమను 'మిత్రమా! చాలా దాహంగా ఉంది. నాకు నీరు తీసుకురావా?' అని అడిగింది చీమను.

పక్కనే ఉన్న నదిలోకి వెళ్లి నీటిని తీసుకొచ్చి చెట్టుకు పోసేది. అలా దాహం వేసినప్పుడల్లా నదిలోని నీరు చెట్టుకు పోసేది చీమ. కొన్ని రోజుల తర్వాత ఆ చెట్టు చనిపోయింది.

మిత్రున్ని కోల్పోయినందుకు చీమ చాలా బాధపడింది. ఏడుస్తూ.. నది దగ్గరికి వెళ్లింది. జరిగిన సంగతి అంతా చెప్పింది. అప్పుడు నది 'మిత్రమా! మానవులు దీనిలో మురుగునీరును, ప్లాస్టిక్ వ్యర్థాలను అన్నిటిని నాలోనే వేస్తున్నారు. దాని వల్ల నేను కలుషితం అయిపోయాను. ఆ నీటినే నీ మిత్రుడు చెట్టు తాగి, ప్రాణాలు కోల్పోయింది' అని చెప్పింది.

చీమకు ఏం చేయాలో అర్థం కాలేదు. 'నా మిత్రుని లాగా ఇంకా ఎవరు ప్రాణాలు కోల్పోవొద్దు' అని అనుకొంది. బాగా ఆలోచించి నది పక్కన ఉన్న చెట్ల ఆకుల పైన 'దయచేసి మురుగునీటిని, వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను నదిలో వేయకండి. దానివల్ల మా చిన్న ప్రాణాలు కోల్పోతున్నాం' అని రాసి పెట్టింది.

అది చూసిన జనం ఆ నదిలోకి మురుగునీరు వెళ్లకుండా ఇంకుడు గుంతలు తీసుకున్నారు. కొన్ని నెలల తర్వాత నది నీరు స్వచ్ఛంగా మారింది. చీమ చేసిన పనికి నది, చెట్టు చాలా సంతోషించారు.

- షేక్ సమీర్
9వ తరగతి,
63053 93291.

సరైన నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ క్రిస్మస్ తాత ఉన్నారు. ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో ఆయన సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 3



నేను గీసిన బొమ్మ

- సంపసాల వాసుదేవ వరప్రసాద్,
6వ తరగతి,
గాయత్రి, యు.పి. స్కూలు,
కొండపల్లి, ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సాహస యాత్రికుడు ...

అనారోగ్యం, ఆర్థికలేమితో ఇబ్బందులు పడుతున్నా వేలకిలోమీటర్ల ఎత్తుకు సాగుతోంది సత్యరూప్ సిద్ధాంత పర్వత యాత్ర. 2012 నుంచి మొదలైన అతని పర్వాతారోహణం ప్రపంచ రికార్డుల్లో నిలిచింది. ఆస్తమా వంటి దీర్ఘకాల వ్యాధితో బాధపడుతూనే మౌంట్ కిలిమంజారో, మౌంట్ ఎల్బ్రస్, మౌంట్ అకాన్‌గువా, మౌంట్ డెనాలి, మౌంట్ బ్లాంక్, మౌంట్ కోస్కియుస్కో, మౌంట్ ఎవరెస్ట్ కు ఎగబాకి స్వల్పకాలంలో ఏడు శిఖరాలు, ఏడు అగ్ని పర్వత శిఖరాలను అధిరోహించిన ఏకైక భారతీయుడుగా చరిత్రలో నిలిచాడు.

సత్యరూప్ పర్వతయాత్ర జాబితా చాలా పెద్దదే. ఇందులో గొప్పేముంది? చాలామంది పర్వతారోహకులు ఇవన్నీ సాధిస్తారు కదా అనుకోవచ్చు. అయితే అందరూ వేరు.. సత్యరూప్ వేరు.. బాల్యం నుంచి ఆస్తమా సమస్యతో బాధపడుతున్నాడు. సాధారణంగా ఎత్తుకు వెళ్లే కొలది ఊపిరి పీల్చుకోవడం కష్టమవుతుంది. ఆస్తమా బాధితులకు ఆ ఇబ్బంది మరింత తీవ్రంగా ఉంటుంది. కానీ సత్యరూప్ ఆ అడ్డంకులను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొనేవాడు. అనారోగ్యం ఒక్కటే కాదు పర్వతారోహణం చేయడమంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. లక్షల రూపాయలు కావాల్సివుంటుంది.

'భారత్‌లో పర్వతారోహణం చేయడం చాలా తక్కువ ఖర్చులో అయిపోతుంది. కాని ధ్రువ ప్రాంతాలు ట్రెక్కింగ్ చేయడం ఖర్చుతో కూడుకున్నది. ఆ ప్రాంతాలు వెళ్లేందుకు నేను బ్యాంకు నుంచి రుణం కూడా తీసుకునేవాడిని' అంటున్న సత్యరూప్ ఫ్రీలాన్స్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, మోటివేషనల్ స్పీకర్‌గా వ్యవహరిస్తున్నారు.

విజయం.. వైఫల్యం..

సత్యరూప్ యాత్రలో ఎన్నో అనుభవాలు. విజయాలు, వైఫల్యాలు అతనికి కొత్తకాదు. 2015లో ఎవరెస్ట్ ఎక్కేందుకు ప్రయత్నించినప్పుడు బేస్ క్యాంపునకు చేరుకునేసరికి నేపాల్‌లో భూకంపం సంభవించింది. ఈ కారణంగా పర్వతారోహకులకు అనుమతి లభించలేదు. అక్కడే బేస్ క్యాంపులో తలదాచుకోవాల్సివచ్చింది. అయితే భారీ హిమపాతం వల్ల బేస్‌క్యాంప్‌లో 20 మంది చనిపోయారు. ప్రాణాలు దక్కినా సత్యరూప్ రూ.18 లక్షలు నష్టపోయాడు. ఇంకోసారి ఇండోనేషియా కార్స్టెన్జ్ పిరమిడ్‌కు

బయలుదేరినప్పుడు అడవులగుండా ప్రయాణించవలసి వచ్చింది. వెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలు అయిపోయాయి. ఆకలికి తీరేందుకు అడవుల్లో పంటపొలాల్లో తిరిగే ఎలుకల నుంచి సగం తిన్న సాసెజ్‌లను లాక్కొని తినేవాడు. ఇంతాచేసి ప్రయాణం చేసినా అతను అక్కడికి చేరుకునే వీలులేకుండా పోయింది. ఏటవాలుగా ప్రయాణం చేయాల్సి రావడంతో కొన్ని సాంకేతిక కారణాల వల్ల నేపాల్ ప్రభుత్వం ఆ ట్రిప్‌ను రద్దు చేసింది. 'కిందికి దిగేటప్పుడు నా వేళ్లు గడ్డకట్టుకుపోయాయి. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. ఈ ఆలోచనల్లో ఉండగానే నేను దిగుతున్న పర్వత అంచు ఒక్కసారిగా కూలిపోయింది. అదేపనిగా దొర్లుకుంటూ వెళుతున్న నన్ను హెలికాప్టర్ రక్షణ సిబ్బంది రక్షించారు. నా నడుముకు ఒక తాడును కట్టుకోమన్నారు. నేను ఆ పని పూర్తి చేయగానే నన్ను పైకి లాగడం ప్రారంభించారు. మంచుపర్వతం నుంచి పైకి వెళుతున్నప్పుడు ఒక చిన్న తాడు సాయంతో హెలికాప్టర్ వరకు చేరుకోగలనా అనిపించింది. అదొక భయంకర అనుభవం' అంటూ నాటి సంగతిని గుర్తుచేసుకుంటాడు. మంచుతుపానులో చిక్కుకోవడం, మంచు చరియలు విరిగిపడడం, మంచు పగుళ్లలో కూరుకు పోవడం వంటి ఎన్నో భయంకర అనుభవాలు కోకొల్లలు.

ఒకసారి మంచుపగుళ్లలో దిగబడిపోయి 15 అడుగుల లోతుకు జారిపోయాడు. 'చుట్టూతా చీకటి. ఎటు చూసినా మంచు పలకలే దర్శనమిస్తున్నాయి. ఆ సమయంలో భయపడకుండా మంచు అందాలను ఆస్వాదిస్తూ గడిపాను. అంతకు మించి అక్కడ చేయడానికి ఏమీ లేదు అంటున్న సత్యరూప్‌ను అరగంట తరువాత తోటి పర్వతారోహకులు రక్షించారు. ఆ తరువాత ఆ బృందంలో ఒక సభ్యుడు అలా మంచు పగుళ్లలో ఇరుక్కుపోయి చనిపోవడం సత్యరూప్ కళ్లారా చూశానని చెబుతారు. ఈ సందర్భాన్ని చెబుతూ 'పర్వతారోహకులు శారీరక బలమే కాదు.. మానసిక బలం కూడా కావాలి' అంటారు.

ఆక్సిజన్ సిలిండర్ పనిచేయలేదు..

ఎవరెస్ట్ ఎక్కుతున్న చివరిదశలో ఉండగా సత్యరూప్ ఆక్సిజన్ సిలిండర్ పనిచేయలేదు. అంత ఎత్తులో సాధారణం కంటే మూడోవంతు ఆక్సిజన్ లభ్యమయ్యే ఆ వాతావరణంలోనే సత్యరూప్ ఎవరెస్ట్ అధిరోహించారు. అదేరోజు ఆక్సిజన్ సిలిండర్ పనిచేయడంలో తలెత్తిన లోపాల కారణంగా ముగ్గురు పర్వతారోహకులు చనిపోవడం అతనికి తెలిసినా ఏమాత్రం భయపడకుండా లక్ష్యాన్ని పూర్తిచేశారు.

తాజాగా ఉత్తర ధ్రువ యాత్ర చేసేందుకు సిద్ధమైన సత్యరూప్ ఉక్రెయిన్-రష్యా యుద్ధం, కోవిడ్ వల్ల వరుసగా మూడేళ్ల నుంచి ఆ యాత్రను వాయిదావేసుకోవాల్సి వచ్చింది. నా ప్రతి యాత్రా నా లక్ష్యాన్ని మరింత విస్తృతపరుస్తుంది. ఎత్తైన ప్రదేశంలో నేను వేసే ప్రతి అడుగు నాకు అద్భుతంగా అనిపిస్తుంది' అంటారు. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టినా, ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా లక్ష్యం చేరుకోవడంలో వెనుదిరగని సాహసికుడు సత్యరూప్.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



16 చుక్కలు,
రెండు వరసలు
సరి చుక్క
2 వచ్చే వరకు

- జె. వెంకట రమణమ్మ,
బైట మంజులూరు,
పంగులూరు మండలం,
బాపట్ల జిల్లా.

బాధితులకు వైద్యసాయం

పేదలకు అండగా నిలిచిన నటుడు సోనూ సూద్ మరోసారి తన దాతృత్వ గుణాన్ని చాటుకున్నారు. ఈసారి ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారికి చికిత్స అందించేందుకు సోనూ సూద్ ముందుకొచ్చారు. 'ఐ ప్లెడ్జ్ ఫ్రీ నీ ఇంప్లాంట్స్ / కదమ్ బడాయేజా' పేరుతో మోకాలు నొప్పులతో బాధపడుతున్నవారికి అండగా నిలవనున్నట్లు ప్రకటించారు. తన స్వచ్ఛంద సంస్థ 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో మోకాలి చిప్పల వ్యాధితో బాధపడుతున్న వారికి సాయం చేయడానికి 'కదమ్ బడాయే జా' ప్రచారాన్ని ప్రారంభించారు. దీని కింద ఆయన ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న రోగులకు చికిత్స పొందడానికి సహాయం చేయనున్నారు.

ఎన్‌బికె-108లో శరత్ కుమార్

బాలకృష్ణ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఎన్‌బికె-108వ సినిమా గురించి తాజా సమాచారం ఒకటి బయటికి వచ్చింది. ఈ చిత్రంపై దర్శకుడు అనిల్ రావిపూడి ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ని షేర్ చేశారు. ఈ చిత్రంలో తమిళ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నట్టుగా తెలిపారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ నిర్మాణం వహిస్తోంది.

'ఫర్హానా' ఫస్ట్‌లుక్ పోస్టర్..!

నటన ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది ఐశ్వర్య రాజేష్. ప్రస్తుతం ఆమె పన్నెండు సినిమాల్లో నటిస్తున్నారు. అందులో 'ఫర్హానా' ఒకటి. ఇందులో ముగ్గురు పిల్లలకు తల్లిగా నటించబోతోంది. నెల్సన్ వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఐశ్వర్య రాజేష్ ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. మహిళా ప్రధానంగా సాగే ఈ సినిమా మనుషులు భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాను డ్రీమ్ వారియర్స్ సంస్థ నిర్మిస్తుంది. షూటింగ్ చివరిదశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.

పది భాషల్లో సూర్య 42

సూర్య తన 42వ చిత్రం ద్వారా ఏకంగా పది భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. శివ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ భారీ పీరియాడిక్ డ్రామాని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే గోవా..చెన్నైల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. శుక్రవారం నుంచి మరో షెడ్యూల్ మొదలైంది. ఈ చిత్రంలో సూర్యకు జోడీగా బాలీవుడ్ నటి దిశా పటానీ నటిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 3డీ ఫార్మెట్‌లో రిలీజ్ చేయనున్నారు. పదిభాషల్లో ఒకేసారి ఈ ఫార్మెట్‌లో సూర్య చిత్రం విడుదలవ్వడం ఇదే తొలిసారి.

ఓటీటీలో లవ్ టుడే!

గతనెల 25న విడుదలైన 'లవ్‌టుడే' తమిళ చిత్రం తెలుగులోనూ విజయాన్ని సొంతం చేసుకుంది. కేవలం రూ. 5 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా సుమారు రూ. 60 కోట్లకు పైగా వసూళ్ల సాధించింది. తాజా సమాచారం ప్రకారం ఓటీటీ ప్లాట్‌ఫారం నెట్‌ఫ్లిక్స్ లవ్‌టుడే డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 25న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని ఓటీటీలో రిలీజ్ చేయనున్నట్లు సమాచారం.

ఖుష్బూ ఇంట విషాదం

సీనియర్ నటి ఖుష్బూ సోదరుడు అబ్దుల్లా ఖాన్ శనివారం కన్నుమూశారు. ఈ విషయంపై ఖుష్బూ ఎమోషనల్ పోస్ట్‌ను షేర్ చేశారు. 'మనకు ఇష్టమైన వాళ్లు ఎప్పుడూ మనతోనే ఉండాలని కోరుకున్నప్పటికీ వీడ్కోలు చెప్పే సమయం వస్తుంది. ఈ రోజుతో మా అన్నయ్య ప్రయాణం ముగిసింది. ఆయన ప్రేమ, గైడెన్స్ ఎప్పుడూ మాతోనే ఉంటాయి.' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కాగా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అబ్దుల్లా ఖాన్ గతంలో కొన్ని సినిమాల్లో నటించారు.

మూడోసారి మురిసేదెవరో..?

- అర్జెంటీనా, ఫ్రాన్స్ జట్ల మధ్య నేడు ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ పోటీ
- క్రొయేషియాకు మూడోస్థానం

రాత్రి 8.30గం॥ల నుంచి ప్రత్యక్ష ప్రసారం

దోహా: ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ ఆదివారం జరగనుంది. లూసైల్ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్, మాజీ ఛాంపియన్ అర్జెంటీనా జట్లు తలపడనున్నాయి. ఈ రెండు జట్లు ఇప్పటివరకు రెండేసిసార్లు ఫిఫా ప్రపంచకప్‌ను గెలుచుకున్నాయి. ఫ్రాన్స్ జట్టు 1998, 2018లలో ప్రపంచకప్‌ను సాధించగా.. అర్జెంటీనా జట్టు 1986, 1978లలో ఈ టైటిళ్లను సాధించింది. ఫ్రాన్స్ జట్టులో యువ ఆటగాడు ఎంబపే, అర్జెంటీనా జట్టు కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఐదేసి గోల్స్ కొట్టి గోల్డెన్ బూట్ రేసులో ఉన్నారు. ఫ్రాన్స్ జట్టు చివరిసారిగా 2018 ఫిఫా ప్రపంచకప్ ప్రి క్వార్టర్స్‌లోఅర్జెంటీనాను ఓడించింది.

క్రొయేషియాకు మూడోస్థానం..

ఫిఫా ప్రపంచకప్ 3వ స్థానానికి శనివారం జరిగిన పోటీలో క్రొయేషియా జట్టు విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన మూడోబెర్త్ పోరులో క్రొయేషియా 2-1గోల్స్ తేడాతో మొరాకాను ఓడించింది. క్రొయేషియా ఆటగాడు జాస్కో 7వ ని., మిస్లావ్ 42వ ని.లో ఒక్కో గోల్ కొట్టగా.. మొరాకో తరఫున ఏకైక గోల్‌ను అచ్రఫ్ డారీ 9వ ని.లో చేశాడు. ఈ రెండో గోల్స్ తొలి అర్ధభాగంలో నమోదు కాగా.. రెండో అర్ధభాగంలో ఏ జట్టూ గోల్ కొట్టలేకపోయింది.

విజయం దిశగా..

మరో నాలుగు వికెట్లు కూలిస్తే టీమిండియా గెలుపు
జాకిర్ సెంచరీ, బంగ్లాదేశ్ 272/6

చిట్టగాంగ్: తొలి టెస్టులో టీమిండియా విజయం దిశగా పయనిస్తోంది. ఓవర్ నైట్ స్కోర్ వికెట్లేమీ నష్టపోకుండా 40 పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లాదేశ్‌కు ఓపెనర్లు గట్టి పునాదిని వేశారు. నజ్ముల్(67), జాకిర్(100) తొలి వికెట్‌కు 124పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న నజ్ముల్‌ను ఉమేశ్ ఔట్ చేసి తొలి బ్రేక్‌ను సాధించాడు. లంచ్ వరకు బ్యాటింగ్ చేసిన వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత ఆరంగ్రేటం మ్యాచ్‌లోనే జాకిర్ హసన్ సెంచరీ సాధించాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న అతను సెంచరీ తర్వాత అశ్విన్ బౌలింగ్‌లో వికెట్ చేజార్చుకున్నాడు. అక్షర్ పటేల్ 87వ ఓవర్‌లో ముష్ఫికర్ రహీం, నురుల్ హసన్‌ను ఒకే ఓవర్‌లో ఔట్ చేశాడు. ఆ తర్వాత టీమిండియా బౌలర్లు వరుసగా వికెట్లను తీయడంతో బంగ్లాదేశ్ జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సరికి ఆ జట్టు 6 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. షకిబుల్ హసన్(40), మెహిదీ హసన్ మిరాజ్(9) క్రీజ్‌లో ఉన్నారు. దాంతో టీమిండియా విజయానికి 4 వికెట్ల దూరంలో నిలిచింది. చివరిదైన ఆదివారం బంగ్లాదేశ్‌కు విజయానికి మరో 241 పరుగులు కావాల్సి ఉంది. అక్షర్‌కు మూడు, ఉమేశ్, అశ్విన్, కుల్దీప్ యాదవ్‌కు తలా ఒక్కో వికెట్ దక్కాయి.

విద్యార్థులకు ఏకాగ్రత, అకుంఠిత దీక్ష ఉండాలి

ఏకలవ్య ఆదర్శ పాఠశాలల స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ సభలో కేంద్ర సహాయ మంత్రి రేణుకసింగ్ సరుత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏకలవ్య పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకాగ్రత, అకుంఠిత దీక్ష ఉండాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయమంత్రి రేణుకసింగ్ సరుత అన్నారు. ఒక్కొక్క ఇఎంఆర్‌ఎస్ స్కూలుకు రూ.38 కోట్ల విలువైన భవనాలు, ఆట స్థలాలు భవిష్యత్తులో వస్తాయన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయస్థాయి 3వ ఏకలవ్య ఆదర్శ పాఠశాలల స్పోర్ట్స్ మీట్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె జెండా ఊపి ఆటలను ప్రారంభించారు. అనంతరం రేణుక సింగ్ సరుత మాట్లాడుతూ ఈ నెల 17నుంచి 22 వరకు నాగార్జున యూనివర్శిటీలో జాతీయ స్థాయిలో క్రీడల పోటీలు జరుగుతాయన్నారు. క్రీడలతో మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అభినవ్ బింద్రా, సైనా నెహ్వాల్, విశ్వనాథ్ ఆనంద్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ జాతీయ స్పోర్ట్స్ మీట్ -2022ను రాష్ట్రంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆదివాసీల అభివృద్ధికి సిఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆదివాసీలకు రూ.30,270కోట్లకు పైగా అందించారన్నారు. ఈ కార్యక్రమానికి అరకు ఎంపి మాధవి, పాలకొండ ఎమ్మెల్యే కళావతి, 22 రాష్ట్రాల క్రీడాకారులు హాజరయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68